# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
ప్రతీ క్షణం.. ప్రజల పక్షం








సంపుటి: 01 | సంచిక: 340 | హైదరాబాద్ | బుధవారం | 28-05-2025 | పేజీలు: 08


## అవినీతితో సింగరేణి అంతం!



### అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

కొడంగల్, మధిరకు డీఎంఎఫ్‌టీ నిధులు

కార్మికుల కుటుంబాలకు విద్య, వైద్యం అందించాలి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

సింగరేణి జాగృతి ఆవిర్భావం

3

## టర్కీ భారత్‌ని కాదని పాకిస్తాన్‌కి ఎందుకు మద్దతు ఇస్తోంది..?

పెరుగుతున్న టర్కీ-పాకిస్తాన్ సంబంధాలు..

ఇస్లామిక్ ప్రపంచానికి పెద్దన్న కావాలనే కల..

నాటో కూటమిలో ఒంటరవుతున్న టర్కీ..

అందుకే భారత్‌కి వ్యతిరేకంగా, పాకిస్తాన్‌కి దగ్గర..



2

## డిప్యూటీ సీఎం భట్టితో త్రిమెన్ కమిటీ భేటీ..

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్రిమెన్ కమిటీ..

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ముగ్గురు సీనియర్ అధికారులు..

ఉద్యోగుల సమస్యలను భట్టికి వివరించిన త్రిమెన్ కమిటీ.



2

## రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..

మోడీ పాలనపై మల్లికార్జున ఖర్గే విషం చిమ్మారు..

రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..

రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డాడు: బీజేపీ ఎంపీ లక్ష్మణ్



2

## 3 రోజులున్నా 'ముచ్చటే' లేదు!

- రేవంత్‌కు ఢిల్లీలో పరాభవం..
- అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్‌గాంధీ
- కానీ టీపీసీసీ అధ్యక్షుడితో రెండుసార్లు చర్చలు..
- కుటుంబంతో వెళ్లి కలిసిన మహేశ్ కుమార్ గౌడ్
- మంత్రివర్గ విస్తరణపై సీఎం ప్రతిపాదనలు పక్కకు



2

## భూభారతి పేద రైతులకు చుట్టం

48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు



2

## కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్.. విచారణకు వెళ్లేది ఆ రోజే..?

కాళేశ్వరం విచారణలో కీలక పరిణామం..

కమిషన్ ముందు విచారణకు హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయం..

పీసీ ఘోష్ కమిషన్ ముందు జూన్ 5న విచారణకు వెళ్లనున్న కేసీఆర్



3

## జూన్ 2న కవిత కొత్త పార్టీ..?

మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు..

కవిత ఎపిసోడ్ ని ఫ్యామిలీ డ్రామాతో పోల్చిన బీజేపీ ఎంపీ..

జూన్ 2న కవిత కొత్త పార్టీ పెట్టవచ్చు: ఎంపీ రఘునందన్ రావు..



2

## అమెరికాకు కేటీఆర్

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరిన మాజీ మంత్రి

ఈనెల 30న వార్విక్ వర్సిటీలో పరిశోధన కేంద్రం ప్రారంభం

జూన్ 1న రజతోత్సవ వేడుకలు.. 4న తిరుగుపయనం

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని క్యాడర్‌కు పిలుపు



2

## ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

దేశాన్ని పాలించే నైతిక హక్కు మోదీకి లేదు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

లేదంటే ప్రజా ఆందోళనలు కొనసాగిస్తాం

వామపక్షాలు, శాంతి చర్చల సంఘం నేతల వార్నింగ్



2

## రాష్ట్రపతి చేతుల మీదుగా మందకృష్ణకు పద్మశ్రీ ప్రదానం

ఢిల్లీలో ఘనంగా పద్మ పురస్కారాల రెండో విడత కార్యక్రమం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణకు పద్మశ్రీ

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం



4

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

- దేశాన్ని పాలించే నైతిక హక్కు మోదీకి లేదు
- మావోయిస్టులతో చర్చలు జరపాలి
- లేదంటే ప్రజా ఆందోళనలు కొనసాగిస్తాం
- వామపక్షాలు, శాంతి చర్చల సంఘం నేతల వార్నింగ్

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

మావోయిస్టుల ఉద్యమం అంటేనే భయపడిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా.. చివరికి వారి శవాలను చూసి కూడా వణికి పోతున్నారని శాంతి చర్చల సంఘంనేతలు పేర్కొన్నారు. అలాంటి వారికి దేశాన్ని పాలించే నైతిక హక్కు లేదని వామపక్షాల పార్టీల నాయకులు మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ పాలకులకు రావణుడు యుద్ధంలో మరణిస్తే ఆయన దహన సంస్కారాలకు సంబంధించి రాముడు చేసిన హితబోధ తెలియదా? అన్ని ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 6 మంది మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే దహనం చేయడాన్ని తీవ్ర ఖండించారు. హిందుత్వం పేరుతో ఊరేగే బీజేపీ పాలకులు ఏ ధర్మం ప్రకారం మృతదేహాలను దహనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల కోసం ప్రజలపై కేంద్రం యుద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆపరేషన్ కగార్ వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని, లేదంటే ప్రజా ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**ఏ ప్రమాణాలు పాటించారు?**

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ మావోయిస్టులు మృత దేహాలను ఏ ప్రమాణాలు పాటించి పోలీసులే దహనం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మావోయిస్టుల మృతదేహాలను అప్పగిస్తే స్థానిక రాష్ట్రాల్లో శాంతి భద్రతల సమస్య వస్తుందని కేంద్రం ప్రకటించమంటే, ఈ సమాజం కోసం పోరాడుతున్న మావోయిస్టుల ఉద్యమానికి మద్దతు పలుకుతున్నట్లే కాదా? అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తున్న నరమేధాన్ని ఇప్పటికైనా నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని డిమాండ్ చేశారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ దేశంలో అనేక ఘర్షణలు జరిగాయని, అనేక మంది చనిపోయారని, కానీ శవాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలకు పాల్పడిన చరిత్ర ఎక్కడా లేదన్నారు. సీపీఎం జానీ వెస్లీ మాట్లాడుతూ కేంద్ర పాలకులకుగాని కేంద్ర బలగాలకు గాని మనుషులను చంపే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు.

**సంబురాలు చేసుకుంటారా?**

'మావోయిస్టుల మృత దేహాలకు పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం అమానవీయం. సుప్రీంకోర్టు వీటిని సుమోటాగా స్వీకరించి న్యాయ విచారణకు అదేశించాలి. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న మావోయిస్టులను కేంద్ర బలగాలను ఉపయోగించి తుపాకి మడపలతో ముఖాలపై గుద్ది గుద్ది చంపడం ఏంటి? వారేం దోహ్రం చేశారు? ఈ దేశ ప్రజలైన మావోయిస్టులను కాల్చి చంపి శత్రు దేశాలపై విజయం సాధించినట్లుగా మోదీ, అమిత్ షా సంబురాలు చేసుకుంటారా? అసలు వారికి కనీసమైన మానవత్వం ఉన్నదా? మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన మరసటి రోజే కేంద్ర అటవీ పర్యావరణ శాఖ కార్పొరేట్ కంపెనీకి అటవిని దారదత్తం చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీన్నిబట్టి కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోంది' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు.

# జూన్ 2న కవిత కొత్త పార్టీ..?

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు..
- కవిత ఎపిసోడ్ ని ఫ్యామిలీ డ్రామాతో పోల్చిన బీజేపీ ఎంపీ..
- జూన్ 2న కవిత కొత్త పార్టీ పెట్టవచ్చు: ఎంపీ రఘునందన్ రావు..

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత ఎపిసోడ్ ని ఫ్యామిలీ డ్రామాతో పోల్చారు. తెలంగాణలో దేవుళ్ళు ఉన్నారా దెయ్యాలు ఉన్నాయా అన్న విషయంపై చర్చ జరుగుతుంది.. దేవుడి పక్కన దెయ్యం ఉంటే 12 ఏళ్లుగా ఏం చేస్తున్నారు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని వాళ్లే నాటకం ఆడుతున్నారు.. ఒకరితో గొడవ పడితే మరొకరి దగ్గరికి పోయేలా గ్రూపులు క్రియేట్ చేస్తున్నారు.. మాట్లాడుకోవాలంటే తండ్రి, కూతురి మధ్య మధ్యవర్తి ఎందుకు వస్తారు అని అడిగారు. నా రాజకీయ పరిజ్ఞానం ప్రకారం కవిత సొంత పార్టీ పెట్టాలని ఫిక్స్ అయ్యింది.. జూన్ 2వ తేదీన కవిత కొత్త పార్టీ పెట్టవచ్చు.. తర్వాత పాదయాత్ర చేయొచ్చు అని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వ్యాఖ్యానించారు.

అయితే, బీఆర్ఎస్ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారాలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఇంతకు ముందు కూడా కామెంట్ చేశారు. కవిత కాంగ్రెస్ లోకి వెళ్తుందని.. వైఎస్ షర్మిళ తరహాలోనే కవిత కూడా పార్టీ నుంచి బయటకు వస్తుందని గతంలో వ్యాఖ్యానించారు. ఈ సారి ఏకంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే కవిత పార్టీ పెడుతుందని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంతో.. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఏదైనా స్పష్టమైన సమాచారంతో ఆ కామెంట్స్ చేశారా లేక రాజకీయ విమర్శల్లోనే భాగమా అనేది రాబోయే రోజుల్లో ఎమ్మెల్సీ కవిత తీసుకోబోయే నిర్ణయాన్ని బట్టి అర్థమవుతుంది.

# అమెరికాకు కేటీఆర్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరిన మాజీ మంత్రి
- ఈనెల 30న వార్విక్ వర్సిటీలో పరిశోధన కేంద్రం ప్రారంభం
- జూన్ 1న రజతోత్సవ వేడుకలు.. 4న తిరుగుపయనం
- ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని క్యాడర్‌కు పిలుపు

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటనకు వెళ్లారు. లండన్‌లో కూడా ఆయన పర్యటించనున్నారు. మంగళవారం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి వారం రోజుల పర్యటనకు మాజీ మంత్రి బయల్దేరి వెళ్లారు. ఈ నెల 30న యూకేలోని వార్విక్ యూనివర్శిటీ సైన్స్ పార్క్‌లోని పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. అదే విధంగా 'ఇండియా వీక్ 2025' కి హాజరుకానున్నారు. జూన్ 1న డల్లాస్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. అమెరికాలో ప్రవాస భారతీయులతో ప్రత్యేక భేటీ నిర్వహించనున్నట్లు తెలిసింది. జూన్ 4న తిరిగి కేటీఆర్ హైదరాబాద్‌కు రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులున్నారు.

**ఘనంగా ఆవిర్భావ వేడుకలు**

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మీడియా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ భవన్‌లో జూన్ 2న పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎమ్మెల్సీ మధుసూదనా చారి పాల్గొని జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. అదే విధంగా వ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఎగరేసి సంబరాలు జరపాలని సూచించారు. అన్ని నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లోనూ తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని అన్నారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారమైందని కేటీఆర్ గుర్తు చేశారు.

# భూభారతి పేద రైతులకు చుట్టం

**48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు**

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందిస్తున్నానన్నారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించాం.. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు.

చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయి.. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేశారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి.. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి.. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి.. భూభారతి పేద రైతులకు చుట్టం.. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి.. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం.. క్షేత్ర స్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది.. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలి.. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి.. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి.. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటుకు రుణాలు అందించండి.. క్షేత్ర స్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలి.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వినియోగించుకోవాలి.. 29, 30 తేదీల్లో జిల్లాల.. ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి.. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలి.. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలి.

# డిప్యూటీ సీఎం భట్టితో త్రిమెన్ కమిటీ భేటీ..

- ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్రిమెన్ కమిటీ..
- డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన ముగ్గురు సీనియర్ అధికారులు..
- ఉద్యోగుల సమస్యలను భట్టికి వివరించిన త్రిమెన్ కమిటీ..

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముగ్గురు సీనియర్ ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈరోజు (మే 27వ తేదీ) రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో త్రిమెన్ కమిటీ అధికారుల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎంకు వారు వివరించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు త్రిమెన్ కమిటీ అధికారులు వివరించారు.

అయితే, ఈ నెల 29వ తేదీన సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సమావేశంలో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని సబ్ కమిటీ భేటీలో వివరించాలని అధికారుల కమిటీకి డిప్యూటీ సీఎం సూచనలు చేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు అంబరాన్ని అంటాలని చెప్పుకొచ్చారు. రాష్ట్ర కీర్తి ప్రతిబింబించేలా విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

# 3 రోజులున్నా 'ముచ్చటే' లేదు!

- రేవంత్‌కు ఢిల్లీలో పరాభవం..
- అపాయింట్‌మెంట్ ఇవ్వని రాహుల్‌గాంధీ
- కానీ టీపీసీసీ అధ్యక్షుడితో రెండుసార్లు చర్చలు..
- కుటుంబంతో వెళ్లి కలిసిన మహేశ్ కుమార్ గౌడ్
- మంత్రివర్గ విస్తరణపై సీఎం ప్రతిపాదనలు పక్కకు
- నలుగురి పేర్లను సిఫారసు చేసిన రాహుల్ గాంధీ
- ముగ్గురి పేర్లపై ముఖ్యమంత్రి రేవంత్ అభ్యంతరం
- వాకిటి శ్రీహరి పేరు సూచించిన మల్లికార్జున ఖర్గే
- ససేమిరా అన్న సీఎం..ఆది శ్రీనివాస్ కోసం పట్టు
- మహబూబ్‌నగర్, నల్లగొండ బెర్తులపై పీటముడి
- మంత్రివర్గ విస్తరణకు మరింత సమయం పట్టే చాన్స్
- రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా చర్చోపచర్చలు

హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):

సీఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీలో మరోసారి పరాభవం ఎదురైంది. ఈసారి కూడా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకలేదు. మూడురోజులపాటు ఎదురుచూసినా కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. ఇదే సమయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో రాహుల్ గాంధీ రెండుసార్లు చర్చలు జరపడం గమనార్హం. పైగా మహేశ్ కుమార్ గౌడ్ కుటుంబంతో సహా రాహుల్‌ను కలవగా, రేవంత్‌కు కనీసం మొహం కూడా చూపించకపోవడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. టీపీసీసీ అధ్యక్షుడికి ఇచ్చిన గౌరవంలో ఇసుమంతైనా కాంగ్రెస్ ముఖ్యమంత్రికి ఇవ్వకపోవడం ఏమిటని గుసగుసలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీకి వస్తే పిలిపించుకొని, రాష్ట్ర పరిస్థితులపై ఆరా తీయడం కనీస మర్యాద. కానీ రేవంత్ రెడ్డి ఇప్పటివరకు 44సార్లు ఢిల్లీకి వెళ్లినా ఒకటిరెండుసార్లు మినహాయిస్తే ప్రతిసారి కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకుండామొహం తిప్పేసుకోవడం వెనుక కారణం ఏమిటన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతున్నది. తాజా పర్యటనలో ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్ సీఎం రేవంత్‌రెడ్డి తరఫున రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ కోరారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంత్రి వర్గ కూర్పు, రాష్ట్ర పార్టీ వ్యవహారాలపై చర్చించాలని రేవంత్ భావిస్తున్నారని, 30 నిమిషాలు అపాయింట్‌మెంట్ అడుగుతున్నాని రాహుల్‌కు వివరించినట్టు తెలిసింది.

ఈ ప్రతిపాదనపై రాహుల్ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. పైగా రేవంత్‌రెడ్డి వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అదానీతో సత్సంబంధాలు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలిసింది. తరుచూ ప్రధానిని కలుస్తున్నారని, కానీ ఒక్కసారి కూడా బీసీ ఎజెండా మీద మోదీతో చర్చించలేదని, ఇది కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ ఏజెండాను నీరుగార్చడమేనని అసంతృప్తి వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతున్నది. పైగా సీఎం వరుస విదేశీ పర్యటనలపైనా రాహుల్ అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.

**నేను చెప్పినవారికి పదవులిస్తేనే..**

మంత్రివర్గ విస్తరణ జాబితాలో సుదర్శన్‌రెడ్డి, గడ్డం వివేక్, ఆది శ్రీనివాస్, ఫహీం ఖురేషీ పేర్లు ఉన్నట్టు సమాచారం. అయితే పార్టీ అవసరాల దృష్ట్యా గతంలో కొందరికి పదవులు ఇస్తామని మాట ఇచ్చామని, వారికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని సూచించి నా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదని రాహుల్ ఆగ్ర హం వ్యక్తం చేసినట్టు తెలిసింది. మక్తల్ ఎమ్మె ల్యే వాకిటి శ్రీహరికి చోటు ఇవ్వాలని గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి అధిష్ఠానానికి ప్రతిపాదించార ని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం శ్రీహరి పేరును సూచించినట్టు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల నుం చి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిల్లో ఒక్కరినైనా మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానం సూచించినట్టు సమాచారం.

ముస్లిం మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్‌కు అవకాశం ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు నిర్ణయించినట్టు చెప్పుకుంటున్నారు. కానీ రేవంత్ రూపొందించిన జాబితాలో ఒక్కరి పేర్లు కూడా లేకపోవడంపై రాహుల్ అసహనం వ్యక్తం చేశారని సమాచారం. ఎలాంటి పదవి లేని ఫహీం ఖురేషికి ఏకంగా మంత్రి పదవి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించినట్టు చెప్పుకుంటున్నారు. చివరికి.. రాహుల్ స్వయంగా నలుగురి పేర్లను సిఫారసు చేసినట్టు సమాచారం. ఆ నాలుగు పేర్లకు అంగీకారం తెలిపితేనే అపాయింట్‌మెంట్ ఇస్తానని తెగేసి చెప్పినట్టు కాంగ్రెస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**వేణుగోపాల్ క్లాస్?**

రేవంత్‌రెడ్డి ఆదివారం మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యార ని, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పు, ఇతర అంశాలపై చర్చలు జరిపినట్టు తెలిసింది. కేసీ వేణుగోపాల్ కొన్ని సవరణలు, సూచనలు చేసినట్టు సమాచారం. ఈ మేరకు రేవంత్ సోమవారం మరోసారి వేణుగోపాల్‌తో భేటీ అయ్యారని, పీసీసీ కార్యవర్గ జాబితాలో మార్పులు చేసినా, మంత్రివర్గ విస్తరణ జాబితాను మాత్రం యథాతథంగా ఉంచినట్టు చెప్పుకుంటున్నారు. ఇద్దరి మధ్య దాదాపు రెండు గంటలు చర్చలు సాగినట్టు తెలిసింది. వేణుగోపాల్ మాట్లాడుతూ మీ నిర్వాకం వల్ల రాష్ట్రంలో బీఆర్ఎస్ బలపడుతున్నదని, ఈ అంశంలో అధిష్ఠానం అసంతృప్తితో ఉన్నదని చెప్పినట్టు సమాచారం.

అవినీతి ఆరోపణలు, తొందరపాటు నిర్ణయాలు, అనవసర విదేశీ పర్యటనలు ఇందుకు ప్రధాన కారణమని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వ్యవహారశైలి ఇబ్బందిగా ఉన్నదని, ఆమె మరో పవర్ సెంటర్‌గా మారుతున్నదని, ఆమెను తొలగించాలని రేవంత్‌రెడ్డి కోరినట్టు చెప్పుకుంటున్నారు. ఈ ప్రతిపాదన పట్ల కేసీ వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారని, రాష్ట్రంలో పరిస్థితి బాగాలేదనే ఆమెను నియమించారని, అలాంటి వ్యక్తిని తొలగించాలని ఎలా అడుగుతారని ప్రశ్నించినట్టు సమాచారం. చర్చలు ముగిసిన తర్వాత మహేశ్‌కుమార్‌గౌడ్‌ను వెంట బెట్టుకొని కేసీ వేణుగోపాల్ సోమవారం రాహుల్‌ను కలిసినట్టు సమాచారం. పీసీసీ కార్యవర్గం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాహుల్, మంత్రి వర్గ విస్తరణ జాబితాను పక్కన పెట్టినట్టు తెలిసింది.

**నన్ను చులకన చేయడానికే ఇదంతా?**

రాహుల్ సిఫారసు చేసిన నలుగురిలో ముగ్గురి పట్ల రేవంత్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతున్నది. ఇందుకు కారణాలను కలిసి వివరిస్తానని మూడు రోజులు ఎదురుచూసినా అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, ఇదే సమయంలో మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాహుల్ గాంధీ రెండుసార్లు కలవడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. తన ప్రాబల్యాన్ని తగ్గించటానికే అధిష్ఠానం వ్యూహాత్మకంగా ఇలా చేస్తున్నదని సీఎం తన సన్నిహితుల వద్ద అసహనం వ్యక్తం చేశారని సమాచారం. ఏదేమైనా సరే ముగ్గురిని మంత్రులుగా అంగీకరించే ప్రసక్తే లేదని టీపీసీసీ చీఫ్‌కు తెగేసి చెప్పి, రేవంత్‌రెడ్డి వెనుదిరిగినట్టు సమాచారం. దీంతో హస్తిన కేంద్రంగా మూడు రోజులపాటు కాంగ్రెస్ చేసిన హైడ్రామా తుస్సుమన్నది. మంత్రి వర్గ కూర్పు, పీసీసీ కార్యవర్గ ఏర్పాటుపై నిర్ణయాన్ని ఈ నెల 30వ తేదీకి అధిష్ఠానం వాయిదా వేసినట్టు తెలిసింది. ఆ రోజున రాష్ట్ర కీలక నేతలంతా ఢిల్లీకి రావాలని చెప్పినట్టు సమాచారం.

**దాల్ మే కుచ్ కాలా హై**

పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చ కాబట్టే రేవంత్‌ను కాదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌తో రాహుల్ భేటీ అయ్యారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కవర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే.. సాధారణంగా మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రితో చర్చిస్తారని, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఏఐసీసీ కార్యదర్శితో చర్చిస్తే సరిపోతుందని సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. ఇక్కడ రివర్స్ జరిగిందని మంత్రివర్గ విస్తరణపై రాహుల్‌తో మహేశ్‌కుమార్ గౌడ్ చర్చించారని, రేవంత్ రెడ్డి.. కేసీ వేణుగోపాల్‌తో భేటీకే పరిమితం అయ్యారని గుర్తు చేస్తున్నారు. తరుచూ ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల అపాయింట్‌మెంట్లు సాధించే రేవంత్‌రెడ్డి.. ఇన్ని నెలలుగా రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఎందుకు సాధించలేకపోయారని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. ఇద్దరి మధ్య దూరం పెరిగిందనడానికి ఇదే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు.

# రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..

- మోడీ పాలనపై మల్లికార్జున ఖర్గే విషం చిమ్మారు..
- రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే కలలు కంటున్నారు..
- రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డాడు: బీజేపీ ఎంపీ లక్ష్మణ్



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 11 ఏళ్ల పాలనపైనా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే విషం చిమ్మారు అని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. మీడియా స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చారు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారు మోడీ.. దేశంలో అభివృద్ధి తారాస్థాయికి చేరుకుంటుంది అని గుర్తు చేశారు. కానీ, ఎమర్జెన్సీ పెట్టింది కాంగ్రెస్ అని మండిపడ్డారు. అయితే, ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా భారత్ చేరుకుంది.. బీజేపీ, మోడీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ జీర్ణించుకోలేక పోతుందన్నారు బీజేపీ ఎంపీ లక్ష్మణ్.

ఇక, పేదరికం అనుభవించిన వ్యక్తి మోడీ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. మోడీనీ కులం పేరుతో రాహుల్ గాంధీ దూషించారు.. ఇక, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడని ఖర్గే భయంకరమైన కలలు కంటున్నాడు అని ఎద్దేవా చేశారు. దేశంలో యువత ఉద్యోగాలు చేసే వారుగా కాకుండా.. ఉద్యోగాలు ఇచ్చే వారీగా తయారు చేస్తున్నారు మోడీ అని పేర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకుంది రాహుల్ గాంధీ కుటుంబం.. ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ట పెరుగుతుంటే.. మోడీనీ నాయకునిగా కీర్తిస్తుంటే గర్వకారణం కాదా అనేది ఖర్గే చెప్పాలని ఓబీసీ మోర్చ అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

అయితే, ఆపరేషన్ సింధూర్ లాంటి దాడులతో పాకిస్తాన్ కు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడైనా చెశారా అని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో భారత ప్రజలు లేరు.. రేవంత్ రెడ్డి మూడు రోజులు ఢిల్లీలో పడిగాపులు పడ్డారు.. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు అని విమర్శించారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానం.. గతంలో అంజయ్యకు కూడా అవమానం జరిగింది.. ఢిల్లీకి వెళ్ళి కలవడంలో తప్పులేదు.. కానీ, ఇలా పడిగాపులు పడడం తెలంగాణ ప్రజలకు అవమానం అని పేర్కొన్నారు. ఇక, బీజేపీ వెనుక రాజకీయాలు, వెన్నుపోటు రాజకీయాలు చేయదు.. ఏదైనా సరే ముందు నుంచే చేస్తుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ చెప్పుకొచ్చారు.

# టర్కీ భారత్‌ని కాదని పాకిస్తాన్‌కి ఎందుకు మద్దతు ఇస్తోంది..?

- పెరుగుతున్న టర్కీ-పాకిస్తాన్ సంబంధాలు..
- ఇస్లామిక్ ప్రపంచానికి పెద్దన్న కావాలనే కల..
- నాటో కూటమిలో ఒంటరవుతున్న టర్కీ..
- అందుకే భారత్‌కి వ్యతిరేకంగా, పాకిస్తాన్‌కి దగ్గర..


నేషనల్‌బ్యూరో మే 27(ప్రజాక్షేత్రం):

టర్కీ.. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతీయులు ఆ దేశంపై మండిపడుతున్నారు. భారతదేశానికి వ్యతిరేకంగా పాకిస్తాన్‌కి సహకరించింది. టర్కిష్ డ్రోన్లతో పాటు వాటిని ఆపరేట్ చేయడాని ఆ దేశ సిబ్బందిని కూడా నియమించింది. భారత్ జరిపిన దాడుల్లో డ్రోన్లతో పాటు, వాటిని ఆపరేట్ చేయడానికి వచ్చిన సిబ్బంది కూడా హతమయ్యారు. తాజాగా, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ టర్కీ పర్యటనకు వెళ్లారు.

అయితే, ఎర్డోగాన్ టర్కీ ప్రెసిడెంట్ అయిన తర్వాత పూర్తిగా భారత వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు. 2019లో భారత్ ఆర్టికల్ 370ని రద్దు చేసినప్పుడు, భారత్ చర్యలకు వ్యతిరేకంగా, పాకిస్తాన్‌కి మద్దతుగా టర్కీ మాట్లాడింది. తాజాగా, ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ మాట్లాడుతూ.. "మేము పాకిస్తాన్ ప్రజలతో నిలబడతాము. నేను సోదరుడు షాబాజ్ షరీఫ్‌కు ఫోన్ చేసి, మేము కలిసి ఉన్నామని చెప్పాను. భవిష్యత్తులో కూడా మేము పాకిస్తాన్‌తో నిలబడతాము." అని చెప్పారు.

**ఇస్లాం ప్రపంచానికి పెద్దన్న వ్యవహరించాలనే కల**

టర్కీ ఇస్లామిక్ ప్రపంచాన్ని పెద్దన్నగా వ్యవహరించాలని కలలుకంటోంది. ఈ నేపథ్యంలోనే మరో ఇస్లామిక్ దేశమైన పాకిస్తాన్‌కి మద్దతు నిలుస్తోంది. సౌదీ అరేబియా, యూఏఈ ఆధిపత్యాన్ని సవాల్ చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌ని వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌కి దగ్గరవుతోంది. తన ఆయుధాలను పాకిస్తాన్‌కి అమ్మాలని చూడటం కూడా ఒక కారణం.



**నాటోలో ఒంటరవుతున్న టర్కీ**

గత కొన్ని సంవత్సరాలుగా నాటో కూటమిలో టర్కీ ఒంటరివుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అమెరికా నేతృత్వంలోని కూటమిలో ఉంటూనే రష్యా, చైనాలతో టర్కీ స్నేహాన్ని పెంచుకుంటోంది. రష్యా నుంచి ఎస్400 మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ని కొనుగోలు చేసింది. దీంతో కొత్త స్నేహాల కోసం చూస్తోంది. దీంతోనే పాకిస్తాన్‌కి దగ్గరవుతోంది.

**టర్కీ వ్యతిరేకులతో భారత్ మైత్రి**

టర్కీ భారతదేశ వ్యతిరేకతకు మరో కారణం దాని శత్రువులతో భారత్ మైత్రి. ముఖ్యంగా, ఆర్మేనియాఅజర్ బైజార్ మధ్య నగోర్నోకారోబాఖ్ యుద్ధంలో టర్కీ, పాకిస్తాన్ అజర్ బైజాన్‌కి మద్దతు ఇచ్చాయి. ఈ యుద్ధంలో ఓడిపోయిన ఆర్మేనియాకు భారత్ స్వదేధీ వైమానిక రక్షణ వ్యవస్థ ఆకాష్‌తో సహా పలు కీలక రక్షణ సామాగ్రిని అందించింది. టర్కీ ప్రాంతీయ ప్రత్యర్థులైన గ్రీస్, ఇరాన్, సైప్రస్, యూఏఈ, ఇజ్రాయిల్‌తో భారత్ మంచి రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు ఉన్నాయి. ఇది కూడా టర్కీని పాకిస్తాన్ బంధాన్ని బలపరించింది.

# కాళేశ్వరం కమిషన్ ముందుకు కేసీఆర్.. విచారణకు వెళ్లేది ఆ రోజే..?

- కాళేశ్వరం విచారణలో కీలక పరిణామం..
- కమిషన్ ముందు విచారణకు హాజరుకావాలని కేసీఆర్ నిర్ణయం..
- పీసీ ఘోష్ కమిషన్ ముందు జూన్ 5న విచారణకు వెళ్లనున్న కేసీఆర్

**హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):**

కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై విచారణకు కమిషన్ వేసింది. జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపుగా తుది దశకు చేరుకుంది. అయితే, ప్రాజెక్టు నిర్మాణం జరిగినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన ఈటెల రాజేందర్ కమిషన్ ముందు హాజరు కావాలని నోటీసులు అందజేసింది.

అయితే, కాళేశ్వరం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. జూన్ 5వ తేదీన కేసీఆర్ పీసీ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరు కావాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. కాగా, గులాబీ బాస్ కి కాళేశ్వరం మిషన్ నోటీసులు ఇచ్చినప్పటికీ నుంచి పార్టీలో కమిషన్ ముందు హాజరు కావాలా లేదా అని అంశంపై తర్జనభర్జన జరిగింది.. కానీ, చివరకు వచ్చే నెల 5న విచారణకు వెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారు కేసీఆర్. మరోవైపు, జూన్ 6న ఈటెల రాజేందర్, చివరగా జూన్ 9వ తేదీన హరీష్‌రావు హాజరవ్వాలని నోటీసుల్లో పీసీ ఘోష్ కమిషన్ పేర్కొన్నారు.



# అవినీతితో సింగరేణి అంతం!

- అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర
- కొడంగల్, మధిరకు డీఎంఎఫ్‌టీ నిధులు
- కార్మికుల కుటుంబాలకు విద్య, వైద్యం అందించాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత
- సింగరేణి జాగృతి ఆవిర్భావం

**హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):**



కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతితో సింగరేణి సంస్థనే అంతం చేయాలని కుట్ర పన్నుతున్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, సంస్థను కాపాడటమే ధ్యేయంగా సింగరేణి జాగృతి ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె నివాసంలో సింగరేణి జాగృతి ఆవిర్భావ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, టీబీజీకేఎస్‌తో సమన్వయం చేసుకుంటూ సింగరేణి జాగృతి పని చేస్తుందన్నారు. సింగరేణి కార్మికులు విద్య, వైద్యం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంస్థలో 40 వేల మందికిపైగా కార్మికులు పని చేస్తుంటే వారిలో సగానికిపైగా యువకులే ఉన్నారని తెలిపారు. సింగరేణి స్కూళ్లను పునరుద్దరించి సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యం అందజేయాలన్నారు. కార్మిక కాలనీల్లో మెరుగైన వసతులు కల్పించాలని, తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1970లో నిర్మించిన క్వార్టర్స్ కూలిపోయే దశలో ఉన్నాయని, అన్ని రీజియన్లలో కార్మికుల కోసం కొత్త క్వార్టర్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి నుంచి కార్మికులను తొలగించే ప్లాన్**


భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్ వెహికిల్స్‌ను సింగరేణి కార్మికులతోనే నడిపించాల్సి ఉండగా ఆ మిషన్లను ప్రైవేటు వాళ్లతో నడిపిస్తున్నారని, ఇది సింగరేణి గనుల నుంచి కార్మికులను తొలగించే కుట్ర అన్నారు. వెంటనే ప్రైవేట్ వ్యక్తులతో పని చేయించడం ఆపివేయాలన్నారు. సింగరేణి సంస్థ ద్వారా సమకూరుతున్న డీఎంఎఫ్‌టీ నిధులను కార్మికులకు మెరుగైన వసతులు కల్పించడానికి వినియోగించుకుండా సీఎం, డిప్యూటీ సీఎంల నియోజకవర్గాలు కొడంగల్, మధిరకు తరలించుకుపోతున్నారని మండిపడ్డారు. 130 ఏళ్ల సింగరేణి చరిత్రలోనే ఇంతటి అవినీతిని ఎప్పుడూ చూడలేదన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంస్థను ముంచేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకొని తీరుతామన్నారు. సీఎం రేవంత్, ప్రధాని మోదీ కోసం పని చేస్తున్నాడని, అందుకే కార్మికుల ప్రయోజనాలు దెబ్బతీసే లేబర్ కోడ్ గురించి ఒక్క మాట మాట్లాడటం లేదని మండిపడ్డారు. కార్మికుల కోసం తాను స్వయంగా బొగ్గు గనులు, ఓపెన్ కాస్టుల వరకు వచ్చి కూర్చొంటానని హామీ ఇచ్చారు. ఓపెన్ కాస్టుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సింగరేణి జాగృతికి అనుబంధంగా మహిళల విభాగం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 11 ఏరియాలకు సింగరేణి జాగృతికో ఆర్డినేటర్లను నియమిస్తున్నామని ప్రకటించారు. బెల్లంపల్లికి కిరణ్ ఓరం, శ్రీరాంపూర్‌కు కుర్మ వికాస్, మందమర్రికి ఎస్.భువన్, రామగుండం 1కు బొగ్గుల సాయికృష్ణ, రామగుండం 2కు కె. రత్నాకర్ రెడ్డి, రామగుండం 3కు దాసరి మల్లేశ్, భూపాలపల్లికి నరేశ్ నేత, మణుగూరుకు అజ్మీరా అశోక్ కుమార్, కొత్తగూడెంకు వన్నంరెడ్డి వీర నాగేంద్ర సాగర్, కార్పొరేట్‌కు వసికర్ల కిరణ్ కుమార్, ఎస్‌టీపీపీ పవర్ ప్లాంట్‌కు కె. రామ్మోహన్ చారిని నియమించారు.



# భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి**

**శంకర్‌పల్లి మే 27(ప్రజాక్షేత్రం):** భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా హరితసేన మండల ఇన్చార్జిగా మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన గొల్ల మల్లేశంను నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీతో కలిసి మల్లేశం మొక్కలు నాటారు. అనంతరం మల్లేశం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత పర్యావరణం దెబ్బ తినడంతో వింత వ్యాధులు అంటువ్యాధులు ప్రబలుతాయని వీటిని అరికట్టాలంటే సమిష్టిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలన్నారు. మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. అంతే కాకుండా విరివిగా వర్షాలు పడి పంటలు కూడా పుష్కలంగా పండుతాయి అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. హరితసేన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కు మల్లేశం ధన్యవాదాలు తెలియజేశారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరితసేన మండల ఇన్చార్జిగా నియమించినందుకు కో ఫౌండర్ రాఘవేందర్, సెక్రెటరీ అమృతలాల్, మాజీ ఎంపీపీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్, జాంగిర్ ఖాన్, మహేందర్ రెడ్డి, సంజయ్, ఇంద్రసేనారెడ్డి, వెంకటరామిరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.







# మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి

**నర్సంపేట,మే 27(ప్రజాక్షేత్రం):**

నర్సంపేట నియోజకవర్గం నర్సంపేట మండల మహిళా సమాఖ్య సమావేశం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అదే విధంగా మహిళలకు రూ.18 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును మహిళా సంఘాల బాధ్యులకు అందించారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య మహాజన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధ్యమతగా భావించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంతో పావలా వడ్డీతో రుణాలు అందించడం ప్రారంభించి మహిళల ఆర్థికాభివృద్ధికి నాంది పలికిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. త్వరలో మహిళా సంఘాలచే పెట్రోల్ బంక్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధికి ఉపయోగించుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు.



# ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు అందజేసిన డిపో మేనేజర్...

**నర్సంపేట,మే 27 (ప్రజాక్షేత్రం):** మంగళవారం రోజున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో యందు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల ప్రగతి చక్రంఅవార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. నర్సంపేట డిపో లో పనిచేస్తున్న ఉద్యోగులు కండక్టర్లు సంతోష్,స్రవంతి, రమేష్, సుమీల మరియు డ్రైవర్ అశోక్ రెడ్డి, మెకానిక్ రవి, రమేష్ లకు డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి డిపో ఆధాయానికి కృషి చేసినందుకు ప్రగతి చక్రం అవార్డు ప్రశంసా పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, ప్రభాకర్, సూపర్వైజర్లు మరియు డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

**వలిగొండ,మే 27(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల కేంద్రంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాల పై మంగళవారం వలిగొండ ఎస్సై వి యుగేందర్ ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై వి యుగేందర్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేని ఐదు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు. మండల ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని,ప్రతి వాహనానికి స్పష్టంగా నెంబర్ ప్లేట్ కనపడేలా వాహనానికి అమర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అప్పగిస్తాం

- వారంలో గా మంత్రి చేతుల మీదుగా గృహప్రవేశ కార్యక్రమాలు నిర్వహిస్తాం
- ప్రతి లబ్ధిదారునికి విద్యుత్ మీటర్ కనెక్షన్ అందించాలి
- ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించేందుకు చర్యలు చేపట్టాలి
- పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయరమణ రావు

**పెద్దపల్లి,మే 27(ప్రజాక్షేత్రం):** రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నియోజకవర్గంలోని అర్హులైన, ఎంపికైన ప్రతి లబ్ధిదారుడికి అప్పగిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయ రమణారావు తెలిపారు.పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి, రాంపల్లిలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,డబుల్ బెడ్ రూమ్ సముదాయం వద్ద ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా మరియు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే తెలిపారు.పెండింగ్ ఉన్న చిన్న చిన్న పనులను పూర్తి చేసి ఎంపిక చేసిన లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 న అప్పగించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇంటి తాళాలు అప్పగించి ,ఇండ్లు శుభ్రం చేయించాలని,ప్రతి ఒక్కరికి ఓనర్ పేరు మీద విద్యుత్ మీటర్ మంజూరు చేయాలని సూచించారు.జూన్ 10 లోపు మంత్రి వర్యుల సమయం తీసుకుని వారి చేతుల మీదుగా లబ్ధిదారుల గృహ ప్రవేశం చేయించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ పర్యటనలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప మరియు సంబంధిత అధికారులు మరియు మాజీ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, నాయకులు,కార్యకర్తలు మరియు కాంట్రాక్టర్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# షాపూర్ గ్రామ మహిళా దారుణ హత్య

**ఐలాపూర్ గ్రామ శివారులో అనుమానాస్పదంతో మహిళ మృతి**

**నిజామాబాద్,మే 26(ప్రజాక్షేత్రం):** నందిపేట్ మండలంలోని ఐలపూర్ గ్రామ శివారులో నిన్న సాయంత్రం ఓ మహిళ దారుణ హత్యాచారం కు గురైంది.నందిపేట్ మండలం శాపూర్ గ్రామానికి చెందిన సాదా సుమలత అనే మహిళను గుర్తుతెలియని దుండగులు హత్య చేసిన నట్లు తెలుస్తుంది. సుమలత ఇంటి నుంచి నిన్న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో నందిపేట్ మార్కెట్‌కు వెళ్లిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే రాత్రి వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు ప్రారంభించారు. మంగళవారం అయిలపూర్ గ్రామ స్థానిక రైతు ఓ మహిళా శివాన్నీ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రాథమికంగా ఆమెపై హత్యాచారం చేసి హత్య చేసి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఘటన స్థలంలో దుండగులు మద్యం సేవించి సుమలతను బలవంతంగా అత్యాచారం చేసి చంపేసినట్టు సంఘటన స్థలంలో ఆమె చేతికున్న గాజులు పగిలిపోయి,కూరగాయల మూట చిందర వందరగా పడి ఉండడం,దుండగులు రెండు గ్లాసులల లో మద్యం సేవించినట్టు మందు బాటిల్,నైలాన్ తాడు, పక్కనే పడి ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# గురువారం విశాఖలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- పలు తీర్మానాలతో కూటమి ప్రభుత్వానికి నివేదిక
- విశాఖ జిల్లా కార్యవర్గ సమావేశంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల

**అక్కయ్యపాలెం కూడలి,మే 27(ప్రజాక్షేత్రం):** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో గురువారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం (ఎన్ఎజే) కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణలు తెలిపారు. మంగళవారం అక్కయ్యపాలెం కూడలిలోని ఓ ప్రయివేటు హోటల్లో విశాఖ జిల్లా సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు, పి. నారాయణ్ లు మాట్లాడుతూ గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ హాల్ 2..లో ఉదయం 11 గంటలకు రాష్ట్ర కార్యవర్గం సమావేశం ప్రారంభం కానుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన 70 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో తాము ఐదు తీర్మానాలను ప్రవేశ పెట్టి, వాటికి రాష్ట్ర కార్యవర్గం ఆమోదం తీసుకుంటామన్నారు. ఇందులో ప్రధానంగా వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయడంతోపాటు జర్నలిస్టుల సంఘాలకు కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రమాద బీమా వెంటనే పునర్దురించాలని, 11 రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేస్తున్న పెన్షన్ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ లో కూడా త్వరగా అమలు చేయాలని, పార్లమెంటులో చర్చించిన విధంగా ఏపీలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, చిన్న, మధ్య తరహా పత్రికలకు ఎంప్యానెల్ తో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాలని తీర్మానాలు చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కు నివేదిస్తామన్నారు. అంతేకాకుండా రాష్ట్ర మహాసభలకు ఆయా నేతలను ఆహ్వానించడం జరుగుతుందన్నారు. గురువారం నాటి సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులతోపాటు పలు జిల్లాలకు చెందిన ముఖ్య కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఎస్. ప్రసాద్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రంగధామం ఉపాధ్యక్షులు ఆనంద్,ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కింతాడ మదన్, అసోసియేషన్ ప్రతినిధులు మళ్ల త్రినాధ్, డిపి నాయుడు, జి ఆర్ ఎస్ రమేష్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ రావు, కార్యదర్శి శ్రీనివాసరావు, కె.వి శర్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలపై అవగాహన సదస్సు



**ఏలూరు జిల్లా,మే 27 (ప్రజాక్షేత్రం):** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఈరోజు చింతలపూడి కోర్టు ప్రాంగణము నందు పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ అఫెన్సెస్ ఎట్ వర్క్ ప్లేస్) చట్టం పైన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పనిచేసే ప్రదేశాల్లో మహిళల పైన లైంగిక దాడులను నిరోధించే భాగంగా ఈ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నామని,ప్రతి సంస్థలలో మహిళల సమస్యలను పరిష్కరించడానికి కమిటీలను ఏర్పాటు చేసి ఆ వివరాలను సంస్థలందు బహిరంగంగా పొందు పరచాలని సూచించారు.అలాగే అసంఘటిత కార్మికులకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఉంటాయని ఆయా జిల్లాలకు సంబంధించిన మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యక్షంగా ఫిర్యాదు చేసుకోవచ్చని, అలాగే ఫిర్యాదు దారిని వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలియజేశారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ మధుబాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలల పైన అత్యాచారాలు పెరిగిపోయాయని వీటిని నిరోధించడానికి సమాజంలో ప్రతి పౌరులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు బాలలపై ఎటువంటి అఘాయిత్యము జరిగిన వెంటనే దగ్గర లోని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు వైద్య సదుపాయాల నిమిత్తం తక్షణ పరిహారాన్ని అందిస్తారని తెలియజేశారు.అలాగే సాక్షుల వివరాలను గోప్యంగా ఉంచుతారని కావున ప్రజలు ఈ సమస్యను పరిష్కరించడానికి చట్టానికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్పిఓ పి మాధవి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపర్డెంట్ పి.జి.నాయుడు అడ్వకేట్ కేకేడి భవాని పోలీసు వారు పాల్గొన్నారు.

# మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

- జూన్ 9, 10 తేదీలలో రెండు రోజుల శిక్షణ
- జిల్లా జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలి
- విజ్ఞప్తి చేసిన జిల్లా కమిటీ

**కుత్బుల్లాపూర్,మే 27(ప్రజాక్షేత్రం):** మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కోరింది.ఈ మేరకు మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి కి సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు,కార్యదర్శి వెంకట్రాంరెడ్డి లు వినతిపత్రం అందజేశారు.జూన్ 9, 10 వ తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది జర్నలిస్టులకు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.రెండు రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ప్రొఫెసర్లతో,సీనియర్ జర్నలిస్టులతో తరగతులు జరుగుతాయని అన్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనాలను మీడియా అకాడమీ ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేశారు. రెండు రోజులు శిక్షణ పొందిన వారికి మీడియాకాడమీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను కూడా అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి అధ్యక్షులు ఎంఏ కరీం, ఉప్పల్ నియోజకవర్గం యూనియన్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి,సీనియర్ జర్నలిస్టులు తిరుపతి రెడ్డి, నరోత్తం రెడ్డిలు పాల్గొన్నారు.





# అమ్మకు భరోసా కార్యక్రమం లో పాల్గొన్న భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**వలిగొండ,మే 27(ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో,అమ్మకు భరోసా కార్యక్రమం భాగంగా గర్భిణి మంగ భవాని ఇంటిని భువనగిరి కలెక్టర్ హనుమంతరావు భవాని ఆరోగ్యం ఎలా ఉందని అంటూ ఆరా తీశారు. సమయానికి భోజనం చేస్తున్నారా అంటూ ఆప్యాయంగా జిల్లా కలెక్టర్ హనుమంతరావు పలకరించారు.మందులు వేసుకోవాలని నీవు మంచి ఆహారం తీసుకుంటే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు.కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం

**చౌటుప్పల్,మే 27(ప్రజాక్షేత్రం):**

చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో చౌటుప్పల్ మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.ఈ అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అన్నదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రారంభించారు. శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ అన్ని దానాల కల్లా అన్నదానం మహా గొప్పది అని అన్నారు. అన్నదానం నా చేతుల మీద ప్రారంభించడం.నా జన్మ ధన్యమైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా ప్రముఖులు,మంచిగంటి భాస్కర్ గుప్తా,సోమారం సత్యం గుప్త,కాంసెట్ చంద్రశేఖర్ గుప్తా,పోలాడు వెంకటేష్ గుప్తా, నాంపల్లి శ్రీనివాస్ గుప్తా,దాచేపల్లి శ్రీనివాస్ గుప్తా,తడకమళ్ళ శ్రీనివాస్ గుప్తా,దాచేపల్లి రాజు విజయ్,కాంసెట్టి ప్రభాకర్,గజ్జల భాస్కర్, గోరంటి నరసింహరాజు,మంచి కంటి రమేష్, చెరుకు అశోక్, గట్టు రఘు,రాములు తదితరులు పాల్గొన్నారు.





# 41 వ వార్డులో నూతన విద్యుత్ వెలుగులు

- 90కి మరో 20 విద్యుత్ లైట్లు అవసరం...
- త్రాగు నీరంతా కలుషితం
- వార్డు సమస్యలపై ఎమ్మెల్యే వంశీ తమతో కలిసి పర్యటించాలి..
- కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ,శ్రీధర్

**విశాఖపట్నం,మే 27 (ప్రజాక్షేత్రం):**

జీవీఎంసీ పరిధి 41వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ చొరవతో నూతన విద్యుత్ వెలుగులు వచ్చాయి. ఈ మేరకు మంగళవారం స్థానికులతో కలిసి అవసరమైన చోట జీవీఎంసీ విద్యుత్ సిబ్బందితో 70 విద్యుత్ దీపాలను అమర్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే స్టేషన్ కు దగ్గరగా ఉండడంతో జ్ఞానాపురంలో పలు ప్రాంతాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా నిలుస్తున్నాయన్నారు. బయట నుండి వచ్చి ఇక్కడే గంజాయి మందు వంటి చేపడుతున్నారని,చీకటి మయంగా ఉన్న వీధుల్లో నూతన లైట్లు మార్చాలని గత కౌన్సిల్లోనే కోడిగుడ్ల గళమెత్తారు.ఈ మేరకు నూతన మేయర్ పీల శ్రీనివాసరావు సమక్షంలో విడుదలైన 70 విద్యుత్తు లైట్లు మాత్రమే వచ్చాయని మరొక 20 అవసరమని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో ప్రారంభమైతే ఇక్కడి విద్యార్థిని విద్యార్థులు మహిళలు రాకపోకలు అంతరాయం కలగకుండా అత్యధిక వెలుగునిచ్చే లైట్లు అమర్చడానికి శ్రీకారం చుట్టామన్నారు.అలాగే జ్ఞానాపురంలో కొన్ని ప్రాంతాలలో త్రాగునీరు పూర్తిగా కలుషితమైందని, డ్రైనేజీ సమస్యతో దోమలు డెంగ్యూ వంటి జ్వరాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే త్రాగునీటి సమస్యను పరిష్కరించి,డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ స్థానిక వార్డు సమస్యలపై కార్పొరేటర్ తో కలిసి వార్డు విజిట్ చేయాలని కోరారు.అలాగే వార్డులో స్థానిక నాయకులు ప్రజల నుండి కాసులు దండుకుంటున్నారని ఆరోపించారు.దళారీ వ్యవస్థను నిర్మూలించి, ప్రజలకు అవినీతిరహిత పాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు వేలంగిని రావు, కుమార్,సేబస్టియన్ కాలనీ వాసులు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.




# జీవాలకు ప్రభుత్వం ఉచితంగా నట్టల మందులు పంపిణీ చేయాలి

**రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్**

**చౌటుప్పల్,మే 27(ప్రజాక్షేత్రం):** గొర్రెలు, మేకలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నట్టల మందులు పంపిణీ చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు.మంగళవారం చౌటుప్పల్ వృత్తిదారుల భవనంలో గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృత స్థాయి సమావేశం కొండె శ్రీశైలం అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జీవాలకు ఉదయం పూట మందల వద్దనే ప్రభుత్వ వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఖజానా ఖాళీగా ఉందనే సాకుతో ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల నుండి తప్పించునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.గొర్రెల మేకల పెంపకందార్ల సమస్యల పరిష్కారం కోసం జియంపియస్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈసమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డైరెక్టర్ బండారు నర్సింహా,జిల్లా అధ్యక్షులు దయ్యాల నర్సింహా,ఉపాధ్యక్షులు బుడమ శ్రీశైలం ,కార్యదర్శి మద్దెపురం రాజు,సీనియర్ నాయకులు చేగూరి నర్సింహా,నారి వెంకటేష్,చలమంద రాజు,రాజేష్,జెనిగల యాదయ్య,నెల్లికంటి జంగయ్య,దుర్గం అయిలయ్య, బాలెం శంకరయ్య,గజ్జి పాండు,బీమనబోయిన బాలరాజు,నారి బాలకృష్ణ,రామస్వామి,బద్దుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.




# కడపలో కనుల పండుగగా మహానాడు

**ఏలూరు జిల్లా,మే 27 (ప్రజాక్షేత్రం ):** కడపలో కన్నుల పండుగగా మహానాడు ప్రారంభమైంది. మహానాడులో చింతలపూడి నియోజకవర్గం నాయకులు నందిగం సీతారామ తిలక్(బాబీ), టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధి కూలీల సమస్యలపై 30న కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా

**బొల్లుయాదగిరి జిల్లా అధ్యక్షులు**

**వలిగొండ,మే 27(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల పరిధిలోని మంగళవారం రోజున పులిగిల్ల కేర్చు పల్లి గ్రామములలో, ఉపాధి పని ప్రదేశములలో జరిగిన కూలీల సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి మరియు జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేదల వ్యవసాయ కార్మిక సంఘములో ఐక్య పోరాటంతో పాటు వామపక్షాల ఒత్తిడి మేరకు ప్రతి యుపి ఏ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని తీసుకోవచ్చన్న గ్రామీణ ఉపాధి చట్టాన్ని సాధిస్తే,బిజెపి ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తుందని అన్నారు.2005 సంవత్సరములో కూలీలందరికీ పనిముట్లు గడ్డపార,తట్ట,గొడ్డలి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు పది సంవత్సరముల నుండి ఇవ్వడం లేదన్నారు.కూలీలు తమకు ఎంత కూలిస్తున్నారు అర్థం కావడం లేదని అన్నారు.ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా కూలీలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, మండల అధ్యక్షులు వేముల అమరేందర్,మండల నాయకులు కొమ్మిడి సత్తిరెడ్డి,పద్మ ,అండా లు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతి చేతుల మీదుగా మందకృష్ణకు పద్మశ్రీ ప్రదానం

**ఢిల్లీ మే 27(ప్రజాక్షేత్రం):**

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై, వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మొత్తం ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా, తొలి విడతలో నందమూరి బాలకృష్ణ, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వంటి తెలుగు ప్రముఖులతో పాటు మొత్తం 71 మందికి ఏప్రిల్ 28న పురస్కారాలు ప్రదానం చేశారు. తాజాగా జరిగిన రెండో విడత కార్యక్రమంలో మరికొందరు



ప్రముఖులు ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి శోభన పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పద్మశ్రీ అవార్డును ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వి. రాఘవేంద్రాచార్య పంచముఖి (సాహిత్యం, విద్య), ప్రొఫెసర్ కేవల్ కృష్ణ (సాహిత్యం, విద్య) కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు పద్మభూషణ్ పురస్కారం లభించింది.

# విశాఖ దక్షిణ 32 వ వార్డులో పారిశుధ్య రంగానికి కొత్త ఊపిరి:కందుల నాగరాజు

**ముఖాముఖి కార్యక్రమం చైతన్యాన్ని నింపింది**

**విశాఖపట్నం,మే 27(ప్రజాక్షేత్రం):** " వార్డు నెంబర్ వన్‌గా నిలవాలంటే పనితీరు నెంబర్ వన్ ఉండాలి" అనే నినాదంతో, విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేననాయకులు,కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు పారిశుధ్య కార్మికులతో ప్రభావవంతమైన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. శుభ్రతను శ్రద్ధగా కాపాడే దిశగా సమగ్ర ప్రణాళికలు, స్పష్టమైన దిశానిర్దేశాలు ఈ సమావేశంలో వెలువడ్డాయి. కందుల మాట్లాడుతూ, "వార్డు ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించాలంటే పారిశుధ్యమే ప్రాధాన్యం. మీరు చేస్తున్న సేవ అపారమైనది.ఇకపై ఈ సేవ మరింత గౌరవం పొందేలా మనందరం కలిసికట్టుగా పని చేద్దాం" అంటూ కార్మికుల్లో ఉత్తేజం నింపారు.ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీలు,ఇన్స్పెక్టర్లు,హెల్త్ వర్కర్లు,సానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో వారి సమస్యలు,సూచనలు గమనించి,తగిన పరిష్కారాలు తీసుకొచ్చేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని డాక్టర్ కందుల నాగరాజు ఆదేశించారు.ఈ సమావేశం ద్వారా వార్డులో శుభ్రతపై ఒక కొత్త దిశ,కొత్త దృష్టికోణం ఏర్పడిందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, తెలుగు మా (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు

- **సినిమా పరిశ్రమ క్రూవ్ ప్రభుత్వం త్వరగా ఏర్పాటు చేయాలి**
- **ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం సినిమా కళాకారులను ఆదుకోవాలి**
- **ప్రతీ ప్రభుత్వానికి కళాకారులు ఎప్పుడు అండగా ఉంటారు**

**విశాఖపట్నం,మే 27( ప్రజాక్షేత్రం ):**నగరం లో ఇటీవల పబ్లిక్ లైబ్రరీ,హాల్ జరిగిన కార్యక్రమం లో హంగు, అర్భటం లేకుండా, సర్వ, సాధారణంగా గణపతి శ్లోకం,జ్యోతిప్రాజ్వలన తో సంగీత విభవరి,అట,పాట సాంస్కృతిక కార్యక్రమం తోప్రారంభం జరిగింది.ఈ కార్యక్రమం కేవలం సభ్యులకు అసోసియేషన్ విధి,విధానాలు,భవిష్యత్ కార్యాచరణ,ప్రణాళిక వివరించి,గౌరవ సభ్యులకు నియామక (అపాయింట్మెంట్) పత్రాలు ఇవ్వడం అయింది. మరి ముఖ్యం గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం,తెలుగు సినిమా పరిశ్రమ తెలంగాణ, హైదరాబాద్ లో ఉండిపోగా సినిమాలానే ఉపాధి, జీవితం గా నమ్ముకున్న కళాకారులూ ఆంధ్రప్రదేశ్ లో షూటింగ్ లు లేకపోతే అర్ధ ఆకలి తో గడిపే నటి నటులు,సినిమా నైపుణ్యం ఉన్న కళాకారుల పరిస్థితి దిక్కు తోచ్చని స్థితి లో ఉన్న సమయాన్ని అవకాశం గా కొంతమంది పెద్దలు, సినిమా కి సంబంధం లేని నేరస్థులు,ధనవంతులు, క్రిమినల్,రాజకీయ నాయకులు,సినిమా అంటే మేమే,అవగాహన లేని వారు, సినిమా పరిశ్రమ మా చేతులల్లో ఉంది అని మసీ పూసి మారేడు కాయ చేస్తున్న వారి కబంధ హస్తల్లో నుంచి విముక్తి కోసం ఒక్క ప్రత్యేక పరిస్థితుల నుంచి సినిమా కళాకారులకు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేయండి మహాప్రభో అని అనేక మంది పెద్దలను, రాజకీయ,పార్టీ నాయకులు అధినేత లను అనేకమార్లు వినతి పత్రాలతో,అర్జీలతో వేడుకున్న ఇప్పటికి ప్రయోజనం లేదు,చిన్న సినిమా నిర్మాతలను సహకారం,ప్రభుత్వం రాయితీ వారి ప్రోత్సాహం అందించే దిశగా,స్థానిక కళాకారులకు ఉపాధి పరిష్కారం కోసం, ఆంధ్రప్రదేశ్ లో ఉన్న ప్రముఖ, సీనియర్ నటి ,నటులతో కొంతమంది కళాకారులూ కలిసి 2023 సంవత్సరం విజయవాడ కేంద్రం గా ఏర్పాటు చేసిన సినిమా,కల్చురల్ సంస్థ తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తెలుగు మా (ఆంధ్రప్రదేశ్) అని తెలియజేస్తూ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సినిమా ఉపాధి అవకాశాలు,సంక్షేమ, అభివృద్ధి,భవిష్యత్ ప్రణాళిక, లక్ష్యం కలిసి కట్టుగా చేరుటకు,సంకల్పంగా సంస్థ లో ఉన్న కళాకారులూ అందరు ఒక్కరి కొక్కరు సహకారం చేసుకొని,ఐక్యత తో అసోసియేషన్(సొసైటీ) కార్యక్రమం లు ముందుకు నడిపించే విధంగా, అసోసియేషన్ సంస్థ అడ్మిన్ కి చేరిన సభ్యత్వం వరకు సభ్యులకు త్వరలో ఆంధ్రప్రదేశ్,విశాఖపట్నం వేదిక గా జరిగే గొప్ప కార్యక్రమం మన! "తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ 2 వ వార్షికోత్సవ" రోజున రాజకీయ,సినిమా ప్రముఖులు, పెద్దలు చేతుల మీద, సభ్యత్వం ఉన్న కళాకారులకు (నటి, నటులకు) ఐ.డీ కార్డులు మరియు ఇన్సూరెన్స్ చేయించడం జరుగుతుంది. అని ఈ కార్యక్రమం లో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,డా॥పూతి వెంకట రెడ్డి, ఉపాధ్యక్షుడు (జూనియర్ పవన్ కళ్యాణ్) కళ్యాణ్ రాజా, సంయుక్త కార్యదర్శి (జూనియర్ చంద్రబాబు నాయుడు) ధనుంజయ్ ప్రభునే రుకమాకాంత్, ప్రధాన కార్యదర్శి, డా॥ బెల్లం జయకుమార్, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శి, పులుకూరి సతీష్ కుమార్,ఉపాధ్యక్షులు,పాండురంగ విట్టల్, రమేష్‌యాదవ్, యమ్. కృష్ణ కిషోర్, వెంకట రమణ, లోకేష్, రమణ, పాస్టర్ జోషఫ్, రోణా, మణికంఠ, లలిత రాణి, విజయలక్ష్మి గుండాల, సౌమ్య, కుసుమ ప్రియా, సాయి గాయత్రీ, లక్ష్మి ప్రియా, గౌరవ సలహాదారులు, గుండుబిల్లి శ్రీనివాస్,గరగా విజయ శ్రీ భాస్కర్ (పెద్ద బాబు) న్యాయ సలహాదారులు దామోదర్ రావు, ఈశ్వర్ చంద్ర శేఖర్ (క్రిమినల్ లాయర్) సంస్థ పీ ఆర్.ఓ లు ప్రముఖ సినిమా కళాకారులూ కార్యక్రమానికి విచ్చేసి సినిమా నటి,నటులు, కళాకారులూ అందరు కార్యక్రమం లో ఆలోచన,ఆవేదన, భవిష్యత్ కార్యాచరణ అసోసియేషన్ సభ, సమావేశం ద్వారా సభ్యులు తెలియచేశారు! ఈ కార్యక్రమం రాష్ట్ర ఆహ్వాన కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది! తెలుగు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(ఆంధ్ర ప్రదేశ్ ) రాష్ట్ర కార్యవర్గ విస్తరణ కార్యక్రమం లో 202526సం॥లకు ఎంపికైన నూతన పాలకవర్గ సభ్యులు: సంస్థ వ్యవస్థాపక,అధ్యక్షుడు, డా॥పూతి వెంకటరెడ్డి (ఆంధ్రప్రదేశ్), ఉపాధ్యక్షులు, కారుటూరి కళ్యాణ్ రాజా (జూనియర్ పవన్ కళ్యాణ్) (హైదరాబాద్/ ఆంధ్రప్రదేశ్) ఉపాధ్యక్షులు,ఎం.కృష్ణ కిషోర్ (విశాఖపట్నం), ప్రధాన కార్యదర్శి డా॥బెల్లం జై కుమార్ గుప్తా( విజయవాడ), సంయుక్త కార్యదర్శి, రుకమా కాంత్ ధనుంజయ్ ప్రభునే (మహారాష్ట్ర అధ్యక్షులు, తెలుగు మా),సంయుక్త కార్యదర్శి, ఆర్.ఎం.కే.శర్మ, రవి బోనెల (పెప్సీ మెంబెర్,విశాఖపట్నం) రాయుడు చంద్రకుమార్ (తూర్పుగోదావరి జిల్లా), కోశాధికారి, డి.జగ్గారావు (విశాఖ), ఉపాధ్యక్షులు,పాండురంగ విఠల్(ఎన్టీఆర్ జిల్లా) రాంబాబు వనిగల (పశ్చిమగోదావరి) గద్దె వరప్రసాద్ (విజయనగరం) వ్రే రమేష్( రాజమండ్రి) ఉపాధ్యక్షులు,కార్యనిర్వాహక కార్యదర్శి, సతీష్ కుమార్ (ప్రకాశం జిల్లా) గంగాధర్, కృష్ణ (చిత్తూరు జిల్లా) రమేష్ యాదవ్ సిహెచ్ (విశాఖ), డీ.కోటేశ్వరరావు (మద్రాస్), యమ్.యస్.రాజు (కథ రచయిత) వై.రాజశేఖర్ (వైజాగ్) సదానంద్( వైజాగ్) డీ.రామరాజు (కాకినాడ) సాయి చైతన్య మోడీ (ఒంగోలు), ఉమా శంకర్ (చిత్తూరు జిల్లా) రోనా(యన్.టీ.ఆర్ జిల్లా) ప్రశాంత్ (యన్.టీ.ఆర్ జిల్లా) విక్రాంత్ (యన్.టీ.ఆర్ జిల్లా), వీరాంజనేయులు(ప్రకాశం జిల్లా), వీర మణికంఠ (కృష్ణ జిల్లా) కూడ బాలరాజు (అల్లూరి సీతారామరాజు జిల్లా), శాంతారావు,(శ్రీకాకుళం) సంతోష్‌కుమార్(విజయనగరం) జానీ (ఫైట్ మాస్టర్) (శ్రీకాకుళం), న్యాయ సలహాదారులు: దామోదర్ రావు (విజయనగరం),



ఈశ్వర్ చంద్ర శేఖర్, క్రిమినల్ న్యాయ వాది (విజయనగరం) ధర్మారావు(శ్రీకాకుళం జిల్లా కోర్టు) గడ వెంకటేశ్వర్లు(హై కోర్టు న్యాయవాది, గుంటూరు/ కృష్ణ), దువ్వూరి నాగేశ్వరావు (ప్రకాశం / నెల్లూరు) జేష్టదీ సునీల్ కుమార్ (హై కోర్టు న్యాయవాది, కడప/ చిత్తూరు) ఈసీ మెంబర్లు: అల్లురయ్య (ప్రకాశం జిల్లా) ఎం.టి.రాజు, రమణ, సత్తిబాబు, లోకేష్,(వైజాగ్) గంగాధర్, కృష్ణ (చిత్తూరు జిల్లా),పాస్టర్ జోసెఫ్ (విశాఖపట్నం), యమ్.శ్రీనివాస్ శర్మ, గౌరవ సలహాదారులు: ప్రధాన సలహా దారులు, గంట్ల శ్రీను బాబు (జాతీయ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు), గుండుబిల్లి శ్రీనివాస్ (ఏపీ.డబుల్య్. జే.ఫెడరేషన్) గరగా విజయ శ్రీ భాస్కర్(పెద్దబాబు)ధవళ్లేశ్వర రవికుమార్ (ఏపీ.డబుల్య్.జే. ఫెడరేషన్ నాయకులు), కాకుమాను వెంకట వేణు (ఏ.పీ.జే. యు.జర్నలిస్ట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్), నేమాల హేమసుందర్ (ఏ.పీ. జే. యు.జర్నలిస్ట్ యూనియన్ నాయకులు) కిరణ్ కుమార్ (పద్మవతి స్టూడియో అధినేత& దర్శకుడు) వెంకటరమణ (దర్శకుడు) పి.ఆర్.ఓ.లు వీరబాబు(హైదరాబాద్), సంతోష్ పట్నాయక్, వరప్రసాద్ (ఆంధ్రప్రదేశ్) "మహిళా విభాగం కార్యవర్గం": మహిళ అధ్యక్షురాలు, కీర్తన, కార్యదర్శి, కుసుమ ప్రియా, లలితా రాణి, విజయలక్ష్మి గుండాల సౌమ్య, సాయి గాయత్రి శర్మ లక్ష్మీ ప్రియ, శాంతారావు, (శ్రీకాకుళం) సంతోష్ కుమార్(విజయనగరం) జానీ (ఫైట్ మాస్టర్) (శ్రీకాకుళం) అన్ని జిల్లాలకు కళాకారులకు ప్రాతినిధ్యమిస్తూ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎంపిక చేయడం జరిగింది! విచ్చేసిన కళాకారులకు, గౌరవ సభ్యులకు, సభ్యులకు, సలహాదారులకు, న్యాయ సలహాదారులకు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, వైజాగ్ కోఆర్డినేటర్, డా॥పూతి వెంకట రెడ్డి మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందరి తరపున కృతజ్ఞతలు, కళాభి వందనాలు, శుభాకాంక్షలు తెలియజేయడం అయింది.



# జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయండి

**పెద్దమందడి మండల బిసి పొలిటికల్ జేపీసీ అధ్యక్షులు రమేష్ సాగర్**

**పెద్దమందడి,మే 27(ప్రజాక్షేత్రం):** వనపర్తి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం... హక్కుల సాధనకై బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించతలపెట్టిన "జనభేరి" బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్‌సాగర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, జిల్లాలోని అన్ని సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాచాల యుగంధర్ గౌడ్ అని,ఇటీవల వనపర్తి జిల్లాలో చేపట్టిన మార్నింగ్ వాక్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను జనభేరి సభలో ప్రస్తావిస్తామన్నారు. అదేవిధంగా సమగ్ర కుల గణన చేపట్టి, బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి జనభేరి సభలో కృతజ్ఞతలు తెలుపుతామన్నారు. జనభేరి సభలో ప్రముఖ జానపద కళాకారులు జంగిరెడ్డి మరియు జానులిరి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కావున పార్టీలు, మతాలు,కులాల కతీతంగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు పాండురంగ, వనపర్తి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గూడుషా,జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్ గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి, మల్లేష్ గౌడ్,పెద్దమందడి మండల అధ్యక్షులు రమేష్ సాగర్,మనపురం మండల కన్వీనర్ నరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు అందని ఇందిరమ్మ ఇండ్లు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 27(ప్రజాక్షేత్రం):**



రంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హత ఉన్న వారికి ఇల్లు రాకపోవడంతో అనేక విమర్శలకు దారి తీస్తుంది. జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో 18 వేల ఇళ్లకు గాను నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ కేటాయించారు. దీంతో ఆయా గ్రామాల్లో వార్డుల వారిగా ఇళ్ల జాబితాలో విడుదల చేస్తున్నారు. ముందుగా ప్రభుత్వం రాజకీయ కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని ప్రకటించింది కానీ జాబితాలో మాత్రం రాజకీయ సిఫారసులు ఉన్న వారి పేర్లు మాత్రమే వచ్చాయని వాపోతున్నారు. ఇందిరమ్మ కమిటీ సూచించిన మేరకే అధికారులు లిస్ట్ తయారు చేస్తున్నారని చెబుతున్నప్పటికీ ఎంపిక మాత్రం అధికార పార్టీ నేతల కనుసర్లలో జరిగినట్లు స్పష్టం అవుతున్నది జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యేలు అధికార పార్టీ నాయకులు గ్రామాల వారిగా లీస్టులను ప్రకటిస్తున్నారు. గతంలో లిస్టుల పేరున అనేకమంది అర్హత పొందిన జాబితాలో పేర్లు లేకపోవడంతో తీవ్రంగా నిరక్షపడుతున్నారు. పలుచోట్ల అధికారులు కమిటీ సభ్యులను నిలదీస్తున్నారు ఇందిరమ్మ ఇండ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 80'50 లక్షల దరఖాస్తులు అందాయి, వీటిలో 71 లక్షలకు పైగా ఇండ్లను అధికారులు పరిశీలించారు, వీటిలో 18 పాయింట్ 32 లక్షల మంది అర్హులు ఉన్నారు, కాళీ జిల్లాకు మాత్రం మంజూరైన ఇల్లు 18000 మాత్రమే మొదటి విడతలో 18,000 మందికి సంబంధించిన జాబితా ప్రకారం అధికారులు ఇళ్లను కేటాయిస్తున్నారు 13 లక్షల మందిలో కేవలం 18 వేల మందికి మాత్రమే ఇల్లు వచ్చాయని మిగతా వారికి పరిస్థితి ఏంటి అని ప్రశ్నార్థకంగా మారింది. రాజకీయ జోక్యం ఉన్నవారికి ఇండ్లు ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 8.50 లక్షల దరఖాస్తులు చేసుకున్నారు. కులగరణ ఇంటింటి సర్వే భాగంగా అధికార క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించారు కానీ జాబితాలో మాత్రం అధికారులు గుర్తించిన వారి కాకుండా అధికార పార్టీ అండదండల ఉన్నవారికి ఇందుకేటాయింపులు జరిగాయి మరోవైపు అర్హత లేకుండా రాజకీయ సిఫార్సులు ఉన్న వారితో ఎంతోమందికి ఇల్లు దక్కాయి దీంతో జిల్లాలో ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా జరగలేదని పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చూసి పేదలకు ఈసారి కూడా అవకాశం దక్కకపోవడంతో తీవ్రస్థాయిలో వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అర్హులైన వారిని గుర్తించి ఇల్లు కేటాయించలేదని ఆరోపణలు వస్తున్నాయి.

# రైతులకు వరి గోస పట్టించుకోని అధికారులు





- **రోడ్డుపై బైఠాయించిన రైతులు**
- **వడ్లు కోసి రెండు నెలలైనా కొనుగోలు మాత్రం లేదు.**

**నిజామాబాద్,మే 27(ప్రజాక్షేత్రం):**

ఆలూర్ మండలం రాంచంద్రపల్లి గ్రామ ప్రజలు నిజామాబాద్ కు వెళ్లే మెయిన్ రోడ్డు వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు.ఇరువైపుల రోడ్డు బ్లాక్ చేసి రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని రోడ్డుపై బైఠాయించిన రైతులకు సముదాయించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరి కోసి రెండు నెలలు కాగా అయినా ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేస్తలేరని వడ్లు కాస్త ల్యకలు వచ్చి ఖరాబు అవుతున్నాయని రైతులు వాపోయారు.వరి పంట వేయడానికి తెచ్చిన అప్పుల వడ్డీలకే సరిపోతున్నామని ఇదిలా ఉండగా లారీలు రాక వడ్లు కొనుగోలు కాక తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నామని రైతులన్నారు.రైతే రాజు రైతే దేశానికి వెన్నుముక అన్నవాళ్ళు ఈరోజు రైతుల ధాన్యం వర్షానికి కొట్టుకుపోతున్న వారి పైన గింత చలనం లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఇప్పటికైనా రైతుల గోసను పట్టించుకుని తక్షణమే రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ను అధికారులను కోరారు.లారీలను పంపించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాంచంద్రపల్లె గ్రామ రైతులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు కు రుణపడి ఉంటాను

- **ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని జీవో విడుదల చేయడం అభినందనీయం**
- **తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్**



**విశాఖపట్నం,మే 27(ప్రజా క్షేత్రం):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజల అభిమానాన్ని పొందిన నందమూరి తారక రామారావు జయంతిని అధికారం గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 54 విడుదల చేసింది.ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని తమ గడచిన 34 రోజులుగా పోరాటం చేస్తున్నామన్నారు.ఈ క్రమంలోనే అనేక మీడియా సమావేశాలు ఏర్పాటు చేయడం,స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రుణపడి ఉంటానని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇక ప్రతి ఏడాది మే 28వ తేదీని నందమూరి తారక రామారావు జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నదే తను కోరిన మొదటి కోరిక.. చివరి కోరిక అని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు ఉన్నంత కాలం అన్న నందమూరి తారక రామారావు చిరస్థాయిగా గుర్తుండిపోతారని హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి జనసేవ దళ్ శిక్షణ శిబిరం రెండవ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు

- **యువతి యువకులుకు ప్రథమ చికిత్స పైన అవగాహన కలిగి ఉండాలి**
- **సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి**

**చేవెళ్ల మే 27(ప్రజాక్షేత్రం):**చేవెళ్లలో జరుగుచున్న తెలంగాణ రాష్ట్రస్థాయి జనసేన దళ్ శిక్షణ శిబిరంలో రెండవ రోజు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడము జరిగిందని జనసేవ దళ్ శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులు ప్రథమ చికిత్స పైన అందరికీ అవగాహన ఉండాలని అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమానికి ఆలూరు పి హెచ్ సి నుండి డాక్టర్ వేద గారు రావడం శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న యువతీ యువకులకు ప్రథమ చికిత్స పైన అవగాహన కార్యక్రమం లో భాగంగా ఆరోగ్యం పైన తీసుకునే ఆహారం పైన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చేవెళ్ల మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి రెడ్డి మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కే శ్రీనివాస్ షాబాద్ మండల పార్టీ కార్యదర్శి నక్క జంగయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావం

- **కళాకారుల సంక్షేమమే ఫోక్ ఇండస్ట్రీ లక్ష్యం**
- **ప్రభుత్వం500 గజాల స్థలం ఇచ్చి కళాకారులను ఆదుకోవాలి**
- **తెలంగాణ సాధనలో కళాకారులది ప్రధాన పాత్ర**

**కుత్బుల్లాపూర్,మే 27(ప్రజాక్షేత్రం):**గత 30 సంవత్సరాల నుండి కళనే నమ్ముకుని జీవనం సాగిస్తూ, తెలంగాణ ఉద్యమంలో 20 సంవత్సరాల పాటు ఎనలేని కృషిచేసి తెలంగాణ రావడంలో ప్రధాన భూమిక వహించింది కళాకారులని పలువురు నేతలు అన్నారు. కొమురవెల్లి లోని హోటల్ వన్ లో జరిగిన తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సమావేశంలో వివిధ రంగాల కళాకారులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా కలకు జీవం పోస్తూ ఎవరికి వారికి జీవిస్తున్న మనం ఇప్పుడు ఒకటై ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కళాకారులకు ఎటువంటి చేయూతలేదని ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మా కళాకారులను ఆదుకోవాలని వారి కుటుంబాల్లో వెలుగు నింపాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

**తీర్మానాలు**

ప్రభుత్వం ఒక్కొక్క కళాకారునికి 500 గజాల భూమిని కల్పించాలి,

కళాకారులకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను మంజూరు చేయాలి,

వృద్ధ కళాకారులకు పెన్షన్లు ఇవ్వాలి,

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తూఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలి,

కళాకారులకు ఆరోగ్య భీమా ఇస్తూ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలి,

ఈ సందర్భంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కమిటీని ప్రకటించడం జరిగింది అధ్యక్షుడిగా పత్తిపాటి రమణాకర్,ప్రధాన కార్యదర్శిగా సత్తార్ బాయ్,కోశాధికారిగా గజ్వేల్ వేణు, ఉపాధ్యక్షులుగా జిఎల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ సలహాదారులుగా దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజ్, అభినయ శ్రీనివాస్, కోదారి శీను, అంబటి వెంకన్న, బైరాగి మోహన్, కళాంజలి రాజేష్, దత్తాత్రేయ, చికోడు నరసింహులు, కాదూరి గణేష్,వస్పరి విష్ణు, కాపర్తి మల్లికార్జున్ ఉన్నారు,

కోర్ కమిటీ సభ్యులుగా జడల రమేష్, మాట్ల తిరుపతి, శంకర్ బాబు, వడ్లకొండ అనిల్, బుర్ర సతీష్, పొద్దుపొడుపు శంకర్, మాంకాల ప్రసాద్, మల్లిక్ తేజ,పాత శ్రీధర్, గణ శ్యామ్, బుర్ర నటరాజ్, ఓరుగంటి శేఖర్, కోడం సంతోష్, తేలు విజయ, వినోద్, విజువల్ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా బిఆర్.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్ రెడ్డి మరియు గొల్లపల్లి ఆంజనేయులు కళాకారులను శాలువలు మేమెంటో ఇచ్చి ఘనంగా సత్కరించారు.



# చేతికొచ్చిన పంట నేలపాలు

- అన్నదాతలు అతలాకుతలం చేసిన అకాల వర్షా లు
- రంగారెడ్డి జిల్లాలో 500 నుంచి 600 ఎకరాల్లో వరి పంటకు నష్టంజరిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా
- భారీగా నేలరాలిన మామిడికాయలు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 27(ప్రజాక్షేత్రం):** జిల్లాలో కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాత అతలాకుతలమవుతున్నాడు ఇప్పటికే సరిపడ నీరంతా పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగింది. ఉండ పంట చేతికందే సమయంలో అకాల వర్షాలు, వడగండ్లతో పద్ద పూర్తిగా నేలపాలు అయింది, జిల్లాలో ఓవైపు వరి కోతలు ముమ్మరం అవుతున్న తరుణంలో అకాల వర్షాలు రైతన్నను కోల్పోలేని దెబ్బతీస్తున్నాయి. దీంతో శ్రమించిన అన్నదాత ఇప్పటికే ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, షాద్నగర్, ఆమనగల్, కద్తాల్, వంటి ప్రాంతాల్లో అకాల వర్షాలు, వడగండ్లతో వరితో పాటు మామిడి కూరగాయలు, మొక్కజొన్న, అరటి తోటలు దెబ్బ తిన్నాయి, మామిడికాయలు పెద్ద మొత్తంలో నేలపాలయ్యాయి, పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నదాతలు ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పది హేను రోజుల్లో పంట చేతికి వస్తుందన్న సమయంలో వడగండ్ల వాన రావడంతో మామిడికాయలు రాలి పోయాయి కూరగాయల పంటకు నష్టం కలిగింది.

# చేవెళ్లలో టిడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా రాజు,**
**ప్రధాన కార్యదర్శిగా జయ చందర్**

**మొయినాబాద్, మే 27(ప్రజాక్షేత్రం):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) చేవెళ్ల నియోజకవర్గ నూతన కమిటీకి ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాజు అధ్యక్షుడిగా, జయ చందర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. గౌరవ అధ్యక్షులుగా చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడిగా రాజశేఖర్ ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులందరికీ జర్నలిస్టు సంఘాల తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ, వృత్తిగతంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి పోరాట పథంలో నడవాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జర్నలిస్టులకు అత్యంత కీలకమైన అక్రిడేషన్ కార్డుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, అన్ని హక్కులు సాధించేందుకు నిరంతర కృషి చేయాలని, ప్రభుత్వం తరపున జర్నలిస్టులకు లభించే హౌసింగ్, హెల్త్ కార్డులు, పింఛన్లు, ట్రావెల్ పాస్‌లు వంటి సౌకర్యాలు జర్నలిస్టులకు అందేలా చేయడంలో నూతన కమిటీ నేతలు ముందుండాలని జర్నలిస్టులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జర్నలిస్ట్ వర్గానికి మద్దతుగా, వృత్తిపరమైన గౌరవాన్ని నిలబెట్టేలా, చట్టబద్ధమైన హక్కుల సాధనలో నూతన నాయకత్వం ముందడుగు వేయాలని కోరుతూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.







# వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 27(ప్రజాక్షేత్రం):** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల తాళ్లపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి ధాన్యం తడిసి మొలికెత్తింది, దీంతో వరి ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు ఇబ్బందిగా మారింది, వర్షాల వల్ల ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో వరి కోతలు పూర్తి కాలేదు, రోజు వర్షం కురుస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, అధికారులు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా తడిసి ముద్దయి వరి ధాన్యాన్ని అధికారులు త్వరగా స్పందించి ధాన్యం తూకం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టిడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుంది

- జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీ డబ్ల్యూ జె ఎఫ్
- టీడబ్ల్యూజెఎఫ్ జిల్లా కార్యదర్శి సైదులు
- చేవెళ్ల నియోజకవర్గం నూతన కార్యవర్గం ఎన్నిక

**చేవెళ్ల, మే 27(ప్రజాక్షేత్రం):** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా టీ డబ్ల్యూ జె ఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) పనిచేస్తుందని, రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నో విజయాలను సాధించడం టీడబ్ల్యూజెఎఫ్ తోనే సాధ్యమైందని రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యదర్శి సైదులు అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని డ్రీమ్ వ్యాలీ రిసార్టులో జిల్లా కార్యదర్శి సైదులు నేతృత్వంలో టి డబ్ల్యూ జె ఎఫ్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. టిడబ్ల్యూజెఎఫ్ చేవెళ్ల నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి సైదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ... రాష్ట్రంలో, జిల్లాలో జర్నలిస్టుల సమస్యల కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ విజయాలు సాధిస్తున్న సంఘం టీడబ్ల్యూజెఎఫ్ సంఘం మాత్రమేనని అన్నారు. ఈ సంఘం ద్వారా అనేకసమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించామని గుర్తు చేశారు. ముఖ్యంగా జర్నలిస్టుల ఇండ్లు, ఇళ్ల స్థలాల కోసం అనేక పోరాటాలు నిర్వహించి, అందులో విజయం సాధించామని తెలియజేశారు. అలాగే ఆర్టీసీ బస్సులో, ఏసీ బస్సులను జర్నలిస్టులకు సౌకర్యం కల్పించింది టీ డబ్ల్యూజెఎఫ్ అని గుర్తు చేశారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇంటి ఇళ్ల స్థలాలు, కార్పొరేట్ వైద్యంతో పాటు, ప్రభుత్వ హాస్పిటల్ లో కూడా మెరుగైన వైద్యం చేయించడం కోసం సంఘం పోరాటం చేయడంతో, వారి పోరాట ఫలితంగా ప్రభుత్వం సిఫారసులు చేయడం జరిగిందని పేర్కొన్నారు.

### జర్నలిస్టుల ఐక్యతతో ఏదైనా సాధ్యం

**- నియోజకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శి : రాజు, జయచంద్ర**

చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న జర్నలిస్టులందరు ఐక్యతతో ఉంటే ఏదైనా సాధ్యం అవుతుందని , జర్నలిస్టులు అందరూ ఐక్యంగా ఉండాలని, ఒకే గొడుగు కిందకు రావాలని అధ్యక్షులు చేగూరి రాజు పిలుపునిచ్చారు. ఈ సంఘం ఎల్లప్పుడూ జర్నలిస్టులకు తోడ్పాటు అందిస్తుందని, నియోజకవర్గ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టి డబ్ల్యూ జె ఎఫ్ కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యంగా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలో గత పది సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఇప్పుడు కమిటీ ఏర్పడిన నేపథ్యంలో ప్రధానంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు సాధించుకునేందుకు టి డబ్ల్యూ జె ఎఫ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ దిశ, ఉపాధ్యక్షులు ఆశన్నగారి మహేష్, కోశాధికారి ఆనంద్, జిల్లా సూర్య ప్రతినిధి గణేష్, దిశ బ్యూరో ఇన్చార్జ్ సురేష్, ఆంధ్రజ్యోతి జిల్లా ఇంచార్జ్ 2 శ్రీనివాస్ చారి, కౌన్సిల్ సభ్యులు దేవేందర్, లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్ ఇంచార్జ్ బుచ్చయ్య, సీనియర్ జర్నలిస్ట్ లు, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్ పల్లి, ఆయా మండలాల జర్నలిస్టులు, పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యం

- జాబితాల్లో తాము సూచించిన వారి పేర్లుండాలంటున్న కాంగ్రెస్ నాయకులు.
- అనర్హుల పేర్లను తొలగిస్తున్న ఆఫీసర్లుఇరువురి మధ్య కొనసాగుతున్న పంచాయితీ.
- మిగిలిన కొంతా మంది లబ్ధిదారులకు గుండు సున్నానే.
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా అనర్హుల ఎంపికపై అధికారుల అసంతృప్తి.

**చేవెళ్ల, మే 27(ప్రజాక్షేత్రం):**

ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఎంపిక ఇష్టారాజ్యంగా జరుగుతున్నది. అర్హుల ఎంపికకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీల్లో అందరూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే ఉండడంతో వారికి నచ్చినవారినే ఎంపిక చేస్తున్నారు.సీఎంతోపాటు మంత్రులు అర్హులనే ఎంపిక చేయాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతున్నది. ప్రతి గ్రామంలోనూ ఇండ్లు లేని నిరుపేదలు ఐదారుగురు మినహా ఉండరు, కానీ, ఒక్కో గ్రామంలో పదికి పైగా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారిని ఎంపిక చేస్తున్నారనే విమర్శలున్నాయి. చేవెళ్ల మండలం బస్తేపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు, గ్రామ ప్రజల పంచాయతీ. మా గ్రామంలో ఇందిరమ్మ లిస్ట్ లో గ్రామ కమిటీ చైర్మన్ అత్యుత్సాహం మొదట లబ్ధిదారుల లిస్ట్ ప్రకటించి మీరు గ్రామం నుంచి పంపిన లిస్ట్ వచ్చిన లిస్ట్ ఏది అని అడిగితే తలతిక్క సమాధానం వెరిఫికేషన్ కి వచ్చిన ఇల్లు లేదు మొదటి ప్రాధాన్యతలో మూడవ లిస్ట్ పేర్లు ప్రత్యక్షం ఇదేంటని గ్రామపంచాయతీ వాళ్ళని అడిగితే పై అధికారుల మీద చెప్పడం లిస్ట్ సైతం గ్రామపంచాయతీ నోటీస్ పోర్ట్ లో లేదు గ్రామ వాట్సాప్ గ్రూప్ లలో సెలక్షన్ అయినవారికి ఇచ్చిన వారికి కేటాయింపులు మాత్రం తొమ్మిది మందికి ఇల్లు కేటాయింపు చేస్తున్నామని గ్రామ పంచాయతీ వారు చెప్పిన విధానం.






# హైదరాబాద్‌లో దంచికొట్టిన వర్షం

- అధికారులు అప్రమత్తంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశం
- పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం
- తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షం

**హైదరాబాద్ మే 27(ప్రజాక్షేత్రం):** పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షం కురుస్తోంది. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి వివిధ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. అల్వాల్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, లింగంపల్లి, సూరారం, జూబ్లీహిల్స్, బోరబండ తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ నిలిచిపోయి గంటల తరబడి వాహనాలు కదల్లేని పరిస్థితి నెలకొంది..

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలని, పోలీస్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, హైడ్రా, విద్యుత్తు, విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రహదారులపై నీరు నిల్వ లేకుండా ట్రాఫిక్ ఇబ్బంది, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు వర్షాల పరిస్థితిని సమీక్షించాలని సీఎస్ రామకృష్ణారావును ఆయన ఆదేశించారు.

**ఆ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక**

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టం నుంచి 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు ఉండి, ఇది ఎత్తు పెరిగే కొద్దీ దక్షిణ దిక్కుకు వాలి ఉందని తెలిపింది.

**భారీ నుంచి అతిభారీ :**

నేడు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, జనగాం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎల్లుండి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**ఈదురుగాలులు వీచే అవకాశం**

ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ప్రజలు జాగ్రత్తగా ఇంటి వద్దనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లకూడదని తెలిపింది. రాగల మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఐదు నుంచి ఏడు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

# వైరా మాజీ ఎమ్మెల్యే కన్నుమూత - సీఎం సహా రాజకీయ ప్రముఖుల సంతాపం

- వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ కన్నుమూత
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి వైసీపీ తరపున గెలిచిన మదన్‌లాల్
- ప్రస్తుతం బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మదన్‌లాల్

**ఖమ్మం మే 27(ప్రజాక్షేత్రం):** ఖమ్మం జిల్లా రాజకీయాల్లో విషాదం చోటుచేసుకుంది. వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ కీలక నేత బాణోత్ మదన్ లాల్ గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన ఆకస్మిక మరణం ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది.

**పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి**

మదన్‌లాల్ రాజకీయ ప్రస్థానం 2014 అసెంబ్లీ ఎన్నికలతో మొదలైంది. వైరా నియోజకవర్గం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారిన తర్వాత ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన తర్వాత ఆయన పార్టీకి విధేయుడిగా కొనసాగారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున వైరా నుంచి పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. అయినప్పటికీ, పార్టీ ఆయనపై నమ్మకం ఉంచి, వైరా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన నిరంతరం కృషి చేశారు.

**సీఎం సంతాపం**

మదన్‌లాల్ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు సంతాపం తెలిపారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు అనుబంధాన్ని మంత్రి పొంగులేటి గుర్తుచేసుకున్నారు. వైరా నియోజకవర్గ ప్రజలు నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయారని తుమ్మల అన్నారు.

**కేసీఆర్, కేటీఆర్ సంతాపం**

బానోత్ మదన్‌లాల్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. మదన్ లాల్ మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని కేసీఆర్ అన్నారు. మదన్ లాల్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కేసీఆర్, శోకతప్తులైన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మదన్‌లాల్ అకాల మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా నాయకుడిగా, ఎమ్మెల్యేగా వైరా నియోజకవర్గ ప్రజలకు విశేష సేవలందించిన మదన్ లాల్ మరణం పార్టీకి, ముఖ్యంగా గిరిజన, బడుగు, బలహీన వర్గ ప్రజలకు తీరని లోటు అని కేటీఆర్ అన్నారు.



# ఏపిఎం శ్రీనివాస్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

- మరిముత్యాల ల లో ఎంక్వయిరీ చేయగా 225 బస్తాలు దోపిడీ వెలుగులోకి
- సిపిఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్

**కొమురవెల్లి, మే 27 (ప్రజాక్షేత్రం)** మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం తేలు ఇస్తారి అధ్యక్షత జరగగా ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ మాట్లాడుతూ మండలంలోని ప్రధానంగా మార్కెట్లో ప్రారంభోత్సవాల్లో కనీసం కాంటాలను పట్టించుకోకుండా రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి తనదైన శైలి తో గ్రామాల్లో మహిళా గ్రూపులతో మార్కెట్లో నడుస్తున్న క్రమంలో మార్కెట్లోకి వచ్చి కాంటాలను సమస్యలను అడగకుండా మార్కెట్లో పనిచేస్తున్న మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వాళ్లను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి యొక్క పెత్తనం రైస్ మిల్లలతో కుమ్మక్కై కాంటాల్లో సెట్టింగ్ కు పాల్పడి పెద్ద ఎత్తున రైతుల ధాన్యాన్ని చీటింగ్ చేసి అవినీతికి పాల్పడి మహిళా గ్రూపులను బదనాం చేయాలని పన్నాగం పన్ని ఈ కుట్ర చేశారని వీరికి సహకరించిన మండల స్థాయి అధికారులను విచారణ చేసి సస్పెండ్ చేసి చీటింగ్ కేసు నమోదు చేయాలి చీటింగ్ కు గురి అయిన గుర్రైన ధాన్యం డబ్బులు ఎంతయితే ఉంటదో అది విచారణ చేసి తెలిపి సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేయాలి ఐకెపి సెంటర్లలో ఏ అవసరం వైరు గాని ఇతర వస్తువులు ఏవి గాని నేనే తీసుకొచ్చి ఇస్తా మీరు ఏం తేవద్దు ఏదైనా నాతోటి మాట్లాడండి అని చెబుతూ తప్పుడు పద్ధతుల్లో బిల్లులు పెట్టుకుంటూ ఐకెపి సెంటర్లను నిర్వీర్యం చేస్తున్న ఏపీఎం శ్రీనివాస్ రెడ్డిని తక్షణం సస్పెండ్ చేసి రైతులను ఆదుకోవాలి లేనిపక్షంలో మండలంలోని అన్ని గ్రామాల రైతులను ఏకం చేసి వారిని చైతన్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అత్తిని శారద sfi చేర్యాల డివిజన్ తాడూరి భరత్ నీల బిక్షపతి సార్ల యాదయ్య మేకల కృపాకర్ దయానంద్ రవి శ్రవణాచారి పుట్ట అంజయ్య తదితరులు పాల్గొన్నారు





# అభ్యర్థులను స్వీకరిస్తూ... అవసరాలను తీరుస్తూ..

**బాధితులకు CMRF చెక్కులు అందించిన ఎమ్మెల్యే పల్లా..**

**చేర్యాల, మే 27 (ప్రజాక్షేత్రం)**

స్థానిక చేర్యాల పట్టణంలో రేణుక గార్డెన్ లో జరిగిన CMRF చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు..చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు..ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ, అందగత్తెల మీద పెట్టిన శ్రద్ధ, ఆసుపత్రిల మీద పెడితే రాష్ట్రం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుందని తెలిపారు...అదే విధంగా కేటీఆర్ అమెరికా పర్యటన ఉంది అని తెలిసి కూడా, ఈడి నోటీసులు ఇవ్వడం కుట్రపూరిత చర్యగా పేర్కొన్నారు..ఆనంతరం చేర్యాల ప్రాంత వికలాంగులు వచ్చి తమకు వికలాంగ భవనం కావాలి అని వినతి పత్రం ఇవ్వగా, వారి సమస్యను కలెక్టర్ చెప్తానని హామీ ఇచ్చారు..కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, BRSV రాష్ట్ర కార్యదర్శి డా .గదరాజు చందు, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు పెడుతల ఎల్లారెడ్డి, జేఏసీ చైర్మన్ వకుళాభరణం నర్సయ్య, ప్రధాన కార్యదర్శి కోతి దాసు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..






# తాళం వేసిన ఇంట్లో చోరీ..

**దుబ్బాక ప్రజాక్షేత్రం న్యూస్ మే 26**

ఇంటికి తాళం వేసి వేరే ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోనే వస్తువులను చోరీ చేసిన ఘటన దుబ్బాక మండలం గోసన్పల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది దుబ్బాక ప్రొబేషనరీ ఎస్సై అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం గోసానిపల్లి గ్రామానికి చెందిన కొమ్ము స్వామి అనే వ్యక్తి ఒక దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి గ్రామంలోనే వారం రోజుల నుంచి గదిని నిర్మించుకుంటున్నాడు.ఈ క్రమంలో సోమవారం గ్రామంలో ఉన్న ఇంటికి తాళం వేసి, నూతనంగా నిర్మించుకుంటున్న గదికి కుటుంబ సభ్యులు వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగిలి ఉండడంతో, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టబడి ఉంది. దానిలో ఉన్న ముప్పావు తులం బంగారం, 15 తులాల వెండి వస్తువులు అపహరణకు గురైంది. దీంతో బాధితుడు కొమ్ము స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





# టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**టీజేఎఫ్ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు జి. నవీన్ కుమార్**

**ప్రజాక్షేత్రం గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి మే:27**

తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) రజతోత్సవ సంబురాల పోస్టర్లను గజ్వేల్ పట్టణం లో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల సంబురాలు జరుపుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు దగాపడ్డ తెలంగాణ ప్రజల విముక్తి కోసం మలిదశ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచడంలో తెలంగాణ జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని వారు గుర్తుచేశారు. ఈ నెల 31న జలవిహార్ లో నిర్వహిస్తున్న రజతోత్సవాలకు గజ్వేల్ నియోజకవర్గం నుండి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ లో టీజేఎఫ్ గజ్వేల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, సభ్యులు ఏం. కరుణాకర్, సీహెచ్ కృష్ణ, మల్లేశం, శంకర్, యాదగిరి, కర్ణాకర్, ప్రభాకర్, నరేష్, ఎం. స్వామి, భాను, తదితరులు పాల్గొన్నారు.





# షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- గుర్జకుంటకు డబుల్ బీటీ రోడ్డు నిర్మించాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్లీ
- పీఐ గుర్జకుంట గ్రామ కమిటీ ఎన్నిక

**ప్రజాక్షేత్రం చేర్యాల 28 మే** ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం గుర్జకుంటలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ 2వ మహాసభకు నంగి కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అందె అశోక్ హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు సిబిల్ స్కోర్, నాలుగు చక్రాల వాహనాలు వంటి నిబంధనలు తొలగించి ఏలాంటి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గుర్జకుంట గ్రామంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని డబల్ బీటీ రోడ్డు మంజూరు చేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీకి పూర్వవైభవం తీసుకురావడం కోసం పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

**సీపీఐ గుర్జకుంట గ్రామ కమిటీ ఎన్నిక**

గ్రామ కార్యదర్శిగా నంగి కనకయ్య, సహాయ కార్యదర్శులుగా బస్వరాజు నర్సయ్య, నంగి సత్తయ్య, కోశాధికారిగా బొమ్మ అయిలయ్య, సోషల్ మీడియా అధ్యక్షులుగా శనిగరం శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా నంగి అనీల్, కార్యవర్గ సభ్యులుగా శెట్టె రాములు, నంగి సిద్దయ్య, బొమ్మ అశోక్, నంగి సత్తయ్య 11మంది ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యదర్శి కనకయ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, డివిజన్ నాయకులు జంగిలి యాదగిరి, పాల్గొన్నారు.




# బకాయిలు చెల్లించాలని అడిగితే.. మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

**ప్రజాక్షేత్రం హుస్నాబాద్ టౌన్:** గ్రామ పంచాయతీలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని హుస్నాబాద్ పోలీసులు పలువురు మాజీ సర్పంచులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.ఇవాళ ఉదయం నుంచి గ్రామాలకు వెళ్లిన పోలీసులు మాజీ సర్పంచులను హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకొని హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన పనులకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని న్యాయంగా అడిగితే పోలీసులు వెళ్లకుండా అడ్డుకోవడమేమిటని మాజీ సర్పంచులు ప్రశ్నించారు. వారంతా ప్రభుత్వ తీరును నిరసించారు.

తమ బకాయిలను చెల్లించి ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వంగ వెంకటరామిరెడ్డి, బత్తుల శ్రీనివాస్, బత్తిని సాయిలు తోపాటు పలువురు ఉన్నారు.






# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు
- వరిధాన్యం తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి

**ప్రజాక్షేత్రం గజ్వేల్ ప్రతినిధి మే:27** సిద్ధిపేట జిల్లా కుకునూరు పల్లి మండలం తిప్పారం గ్రామం లో మంగళవారం వరిధాన్య కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు 9000 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసినట్టు లోడ్ చేసిన ధాన్యాన్ని దుద్దెడ వరలక్ష్మి రైస్ మిల్లులో దిగుమతి చేస్తున్నట్లు సెంటర్ ఇన్చార్జి కలెక్టర్ కు తెలిపారు. అకాల వర్షాల బారిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ సీట్లు ఎక్కువ మొత్తంలో ఉంచుకోవాలని మిగిలిన ధాన్యాన్నీ సైతం తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం గజ్వేల్ మండలంలోని సింగాటం గ్రామంలో గల వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటివరకు 12,342 క్వింటాల్ వరిధాన్యం కొనుగోలు చేసి వద్దేపల్లి శివసాయి బాలాజీ మిల్ లో దిగుమతి చేసినట్టు సెంటర్ ఇన్చార్జిలు కలెక్టర్ కి తెలిపారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై డిఎం ప్రవీణ్, అడిషనల్ డిఆర్డి ఓ మధుసూదన్, ఆయా మండల తాసిల్దార్ లు సుజాత, శ్రవణ్ తదితరులు ఉన్నారు.



# జిల్లాలో పోలీస్ యాక్ట్

**సీపీ అనురాధ**

**సిద్దిపేట అర్బన్, ప్రజాక్షేత్రం**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉందని సీపీ అనురాధ తెలిపారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (a )నుండి (ఎఫ్) మరియు 22 (2) (ఏ) & (బీ), & 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 No ఐ ఎక్స ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం 28 ఉదయం 6:00 నుండి 12 ఉదయం 6 గంటల వరకు ఆమలులో ఉంటుందన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాము. శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయని తెలిపారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్లో నోస్ పొల్యూషన్, (రెగ్యులేషన్ & కంట్రోల్) రూల్స్ 2000 ప్రకారం పోలీస్ కమిషనర్ గారు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా శబ్ద కాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించడం జరిగింది. మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసిపి అధికారుల అనుమతి పొందాలని సూచించారు. పై నిబంధనలు ఉల్లంఘించి డీజే వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సిటీ పోలీస్ యాక్ట్ 1348 ఫాస్లి సెక్షన్ 76, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీపీ తెలిపారు.




# పవన్ సినిమాలను ఆపే దమ్ము ఎవరికీ లేదు



కొన్ని రోజులుగా నిర్మాతలకి, ఎగ్జిబిటర్లకి మధ్య థియేటర్ల సమస్య నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇది కాస్తా 'హరిహర వీరమల్లు సినిమా' విడుదల దగ్గరకు వచ్చేసరికి మరింత పెద్దదైంది. కొందరు కావాలని ఆ సినిమా విడుదల సమయంలో థియేటర్లు బంద్ చేస్తారని ప్రచారం చేయడం మొదలుపెట్టారు. దీంతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సీరియస్ అయ్యారు. దీనిపై అల్లు అరవింద్ ఒక మీటింగ్ పెడితే, ఆ తర్వాత దిల్ రాజు కూడా సమావేశం ఏర్పాటు చేశారు.ఈ మీటింగ్‌లో దిల్ రాజు మాట్లాడుతూ " కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంది కాబట్టి, ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశా. పర్సంటేజీల విషయంలో ఎగ్జిబిటర్లకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. సమస్యలు తీరకపోతే బంద్ చేస్తామని మాత్రమే అన్నారు. కానీ బంద్ చేస్తున్నట్లు ఎవరూ ప్రకటించలేదు. కొంతమంది కావాలని నా పేరును బయటకు లాగుతున్నారు. పవన్ కళ్యాణ్ సినిమాను ఆపే ధైర్యం ఎవరికీ లేదు. ప్రభుత్వానికి కూడా ఈ విషయంపై తప్పుడు సమాచారం అందింది. మంత్రి దుర్గేష్ నాతో మాట్లాడారు. థియేటర్లు బంద్ చేయడం లేదని నేను వారికి స్పష్టం చేశాను. ప్రభుత్వానికి రాంగ్ కమ్యూనికేషన్ జరిగిందని నేను అనుకుంటున్నాను" అని అన్నారు.

# ముద్దుగుమ్మ ఇక్కడ లేదండోయ్



సాధారణంగా వెండితెరపై హీరోయిన్స్ చేసే గ్లామర్ సందడి ఒక రేంజ్ లో ఉంటుంది. అందువలన ఆడియన్స్ వాళ్లను గుర్తుపెట్టుకుంటారు. కానీ అక్క,చెల్లి ,వదిన,పాత్రలను చేసేవారిని పెద్దగా గుర్తుపెట్టుకోరు. క్యారెక్టర్ ఆర్టిస్టుల జాబితాలో కనిపించే చాలా తక్కువ మందికి మాత్రమే ఎక్కువ పేరు వస్తూ ఉంటుంది. అలాంటివారి జాబితాలో శరణ్య ప్రదీప్ పేరు కూడా కనిపిస్తూ ఉంటుంది. ఫిదా' సినిమాలో సాయిపల్లవి సిస్టర్ పాత్రలో, తొలిసారిగా ఆమె తెరపై మెరిసింది. ఈ సినిమా చూసినవాళ్లు, సాయిపల్లవి నటనకి మంచి మార్కులు ఇచ్చినప్పటికీ .. ఆమె సిస్టర్ రోల్ చేసిన అమ్మాయి ఎవరోగానీ చక్కని కనుముక్కు తీరుతో ఆకట్టుకుందని చెప్పుకున్నారు. ఆ కారణంగానే ఆ తరువాత ఆమె వరుస అవకాశాలతో దూసుకుపోయింది. నటనలో సహజత్వం, డైలాగ్ డెలివరీ, ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెను ఆడియన్స్ కి చేరువ చేస్తూ వెళ్లాయి. అయితే క్రితం ఏడాది శరణ్య ప్రదీప్ నాలుగు సినిమాలు చేసింది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్', 'భామా కలాపం 2' ఆమెకి మరింత గుర్తింపును తెచ్చిపెట్టాయి. దాంతో శరణ్య ప్రదీప్ తన స్పీడ్ పెంచుతుందని అంతా అనుకున్నారు. అయితే అలా జరగలేదు. 'క' సినిమా తరువాత ఆమె కనిపించలేదనే చెప్పాలి. చేతిలో ఎన్ని ప్రాజెక్టులు ఉన్నాయో తెలియదు గానీ, కొన్ని నెలలుగా తెరపై ఆమె కనిపించక పోవడంతో తను ఏమైపోయింది అనే టాక్ ప్రేక్షకుల్లో మొదలైంది. మరి వేచి చూడాలి ఇక ఈ ముద్దుగుమ్మ ఈ సంవత్సరంలో తెరపై కనిపిస్తదో లేదా అని.



# ప్రభాస్ ది అతిథి పాత్ర కాదు

తెలుగు పరిశ్రమ నుంచి త్వరలో రాబోతున్న భారీ చిత్రాల్లో 'కన్నప్ప' ఒకటి. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, మోహన్ బాబు లాంటి పెద్ద పెద్ద తారలు నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాలో ప్రభాస్ పాత్ర గురించి పెద్ద చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభాస్ పాత్ర గురించి మంచు విష్ణు రకరకాల కామెంట్లు చేస్తూ వస్తున్నాడు. తాజాగా ప్రభాస్ పాత్ర కన్నప్పలో ఎంత టైమ్ ఉంటుందో చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఈ సినిమాలో ప్రభాస్ ను అతిథి పాత్ర కోసం తీసుకోవాలని ముందుగా అనుకున్నాం. కానీ తర్వాత 30 నిముషాల వరకు ప్రభాస్ పాత్రను పెంచేశాం. చివరి 50 నిముషాలు ప్రభాస్ ను ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేస్తారు. నాకు తెలిసి ఈ పాత్ర ప్రభాస్ లైఫ్ లో ది బెస్ట్ అవుతుందని నేను అనుకుంటున్నా. పాత్ర అద్భుతంగా వచ్చింది. ప్రభాస్ హైట్, ఫేస్ కట్ అవన్నీ దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశాం. ప్రభాస్ కు మా నాన్న మోహన్ బాబుకు మధ్య వచ్చే సీన్లు అద్భుతంగా ఉంటాయి. ఇందులో మోహన్‌లాల్ పాత్ర 15 నిమిషాలు, అక్షయ్ కుమార్ 10 నిమిషాలు కనిపిస్తారు. సినిమా మొత్తం3 గంటల 10 నిమిషాలు ఉంటుంది. ప్రభాస్ పాత్ర మూవీపై మంచి ఇంపాక్ట్ చూపిస్తుంది' అంటూ చెప్పారు విష్ణు.

# 'అనగనగా ఒక రాజు' రిలీజ్ డేట్ ఫిక్స్



మన టాలీవుడ్ స్టార్ ఎంటర్టైనర్ నవీన్ పొలిశెట్టి హీరోగా మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ చిత్రం "అనగనగా ఒకరాజు". అయితే ఎప్పుడో స్టార్ట్ చేసినప్పటికీ ఈ సినిమాపై మంచి బజ్ ఉంది. మరి లేటెస్ట్ గా ఈ ఎంటర్టైనర్ కి డేట్ ని మేకర్స్ ఒక ఇంట్రెస్టింగ్ ఫన్ ప్రోమోతో రివీల్ చేసేసారు. దర్శకుడు మారి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని మేకర్స్ వచ్చే ఏడాది సంక్రాంతి బరికి సిద్ధం చేసేసారు. ఆల్రెడీ అప్పుడు భారీ సినిమాలు ఉన్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఈ రేస్ లో అనౌన్స్ చేయడం మేకర్స్ కాన్ఫిడెన్స్ అని చెప్పవచ్చు. అన్నట్టు ఈ సినిమాని మేకర్స్ జనవరి 14న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. సో నవీన్ ఆరోజు నుంచి తెలుగు ఆడియెన్స్ కి ఎంటర్టైన్మెంట్ ని అందించనున్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. పండుగ రుచికి సరిగ్గా సరిపోయేలా ఆయన తనదైన మ్యూజిక్ తో మరోసారి మ్యాజిక్ చేయనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.



# భలే ఛాన్స్ కొట్టేసిన అక్కినేని కోడలు

నటి శోభిత.. ఈ పేరు నాగచైన్యను పెళ్లి చేసుకున్న తరువాత ఎక్కువ వినిపిస్తోంది. పలు అందాల పోటీల్లో పాల్గొన్న ఆమె టాప్ మోడల్‌గా గుర్తింపు పొందారు. ఈ అమ్మడు అక్కినేను కోడలిగా అందరికీ పరిచయం అయిపోయింది. నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఇప్పుడిప్పుడే పలు కొత్త సినిమాలకు నటి శోభిత ధూళిపాళ ఓకే చెబుతుంది. అలా పలు వాణిజ్య ప్రకటనల్లో నటించిన శోభిత 2016లో రామన్ రాఘవన్ 2.0 అనే హిందీ చిత్రం ద్వారా నటిగా రంగప్రవేశం చేశారు. ఆ తర్వాత తెలుగులో మేజర్ చిత్రంలో నటించి మంచి గుర్తింపు పొందారు. అలా హిందీ, తెలుగు, మలయాళం చిత్రాల్లో నటించిన శోభిత 2022లో మణిరత్నం సినిమా పొన్నియిన్ సెల్వన్ 1, 2 చిత్రాల్లో వానతి అనే పాత్రలో నటించి పేరు తెచ్చుకున్నారు. అదేవిధంగా హాలీవుడ్‌లో మంకీ మాన్ చిత్రంలో నటించి పాన్ వరల్డ్ నటిగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా మరోసారి తమిళ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దర్శకుడు పారంజిత్ దర్శకత్వం వహిస్తున్న వెట్టువన్ చిత్రంలో హీరోయిన్‌గా ఆమె నటిస్తున్నట్లు తెలిసింది. ఇంతకుముందు అట్టకత్తి, కబాలి, సార్పట్టా పరంపరై వంటి భారీ చిత్రాలను తెరకెక్కించిన పా.రంజిత్ ఇటీవల విక్రమ్ కథానాయకుడుగా తంగలాన్ చిత్రం చేశారు. తాజాగా వట్టువన్ అనే చిత్రాన్ని రూపొందిస్తున్నారు. గోల్డెన్ రేష్మియా ఫిలిమ్స్‌తో కలిసి నీలం స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో అట్టకత్తి దినేష్ కథానాయకుడుగా, ఆర్య ప్రతి నాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం గ్యాంగ్ స్టర్స్ ఇతివృత్తంతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ ప్రారంభమైంది. మరి ఈ చిత్రంలో శోభిత ధూళిపాళ నటిస్తున్న పాత్ర ఏమిటి అన్నది ఆసక్తికరంగా మారింది.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R Publications, #6-31880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459, email id : prajakshetram1@gmail.com, https://prajakshetram.in, RNI NO. TELTEL/12330